

రాజంపేట పూర్వ తహసీల్దారు రవిశంకర్‌రెడ్డిపై విచారణ

- 20 ఎకరాల ప్రభుత్వ భూములు 'ఆకేపాటి'కి ధారాదత్తం
- విచారణకు ముందు సంజాయిషీ నోటీసులు జారీ

కలికిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో రాజంపేట మండల తహసీల్దారుగా పనిచేసిన ఎస్.రవిశంకర్ రెడ్డి అక్రమ భూబాగోతాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా పది రోజుల్లో సంజాయిషీ సమర్పించాలని ఆదేశించింది. రాజంపేట తహసీల్దారుగా పనిచేసే కాలంలో దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ భూములను రవిశంకర్ రెడ్డి 'ఆకేపాటి' కుటుంబీకుల పేరుతో అక్రమంగా మ్యుటేషన్ చేసి తీవ్ర తప్పిదాలకు పాల్పడ్డట్టు ప్రభుత్వం ఆరోపించింది. దీనికి సంబంధించి ఐదు అంశాలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. రాజంపేట మండలంలోని మందపల్లె గ్రామంలోని సర్వే నెంబరు 814-3లో ప్రభుత్వ భూములు 4 ఎకరాలు ఆకేపాటి జ్యోతమ్మ పేరుతోనూ, 814-4లో 5 ఎకరాలు ఆకేపాటి సుజన పేరుతో, 815-1లో 3.79 ఎకరాలు ఆకేపాటి సుజన, ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి పేరుతోనూ, ఆకేపాడు గ్రామంలోని సర్వే నెం. 56-9లో 2.35 ఎకరాలు ఆకేపాటి జ్యోతమ్మ పేరుతోనూ అక్రమంగా మ్యుటేషన్ చేసిన రవిశంకర్ రెడ్డి తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడ్డట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో అనంతపురం జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారిగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డి వ్యవహారాలపై విచారణ జరిపేందుకు నిర్ణయించినట్లు ప్రభుత్వం జారీ చేసిన చార్జి నోటీసులో స్పష్టం చేసింది. రికార్డులు తారుమారు చేసినట్లు అన్ని అంశాల్లో స్పష్టమైన ఆధారాలు లభ్యమైనట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ భూములను ధారాదత్తం చేయడానికి వీఆర్వోలు, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు చేసిన ప్రతిపాదనలను రవిశంకర్ రెడ్డి ఆమోదించి అక్రమాలకు పాల్పడినట్లు ప్రభుత్వం తేల్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం నోటీసులు జారీ చేశారు.

కమనీయం సీతారాముల కల్యాణం

- తిరుచ్చిపై ఊరేగిన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో సిద్ధం చేసిన కల్యాణ వేదికపై నూతన వధూవరులైన సీతారాములను అధిష్ఠింప జేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛార ణలతో విశేష భక్తజనం నడుమ కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అనంతరం హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతి చేసి వేడుకల్లో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై విశేషాలంకరణలు చేసి పట్టణ పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు భాష్యంస్వామి, గోకుల్‌స్వామి, మురళి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు శిబ్యాలలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన

రూ. 7 కోట్లతో అభివృద్ధి పనులు ● విశాఖలో శంకుస్థాపన చేయనున్న సీఎం

రాయచోటి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తను ప్రోత్సహించడంతో పాటు ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాయచోటి మండలం శిబ్యాలలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి ఈ పార్కును ఏర్పాటు చేయనున్నారు. ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్న నినాదంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఈ పార్కు పరిశ్రమల స్థాపనకు అవసరమైన స్థలం, మౌలిక సదుపాయాలను అందించే ప్రాంతం. రూ.7 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. 30వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో భాగంగా విశాఖపట్నంలో జరగనున్న కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం విశాఖపట్నంలో ఈ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టి.జి.భరత్, కొండపల్లె శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నారు.

మన ప్రాజెక్టులు భద్రమేనా..?

- జిల్లాలో మైనర్ ప్రాజెక్టులే ఎక్కువ
- హంద్రీ-నీవా ఒక్కటే మేజర్..!
- నిధులు ఇవ్వక.. నిర్వహణ లేక కట్టపై పెరిగిన పిచ్చిమొక్కలు
- మొరాయిస్తున్న గేట్లు.. గ్రీసుకూ కొదవే

మదనపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా దాని అనుబంధ రంగమైన ఇరిగేషన్ ప్రాజెక్టులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సాంకేతికపరమైన పనులు చేపట్టే వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఏఈ, జేఈ వరకూ పోస్టులన్నీ ఖాళీగానే ఉండగా, ప్రాజెక్టుల ఆలనాపాలనా చూసే సిబ్బందిని కూడా నియమించడంలో ప్రభుత్వాలు విఫలమతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుతున్నాయి. ఈ క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను తలచుకుంటూ ఇరిగేషన్‌అధికారులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పుష్కలంగా కురిసినప్పుడే చెరువులు, ప్రాజెక్టులు గుర్తుకొస్తున్నాయి. తీరా అవి నిండాక గేట్లు ఎత్తి వరద నీటిని బయటకు పంపి ప్రాజెక్టును ప్రమాదం నుంచి బయట పడేద్దామంటే గేట్లు మొరాయిస్తున్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం పైసా సొమ్ము ఇవ్వడం లేదు. ఉన్న ఉద్యోగులు, సిబ్బంది రిటైర్ అయ్యాక ఆ పోస్టులన్నీ ఖాళీ అవుతున్నా..ఒక్కరినీ నియమించడంలేదు. దీంతో అక్కడ కాపలా ఉంటున్న వాచ్‌మన్, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఎలక్ట్రీషియన్, లష్కర్..ఇలా



నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టు




ప్రాజెక్టు కట్టపై పెరుగుతున్న మొక్కలు

ప్రాజెక్టులను కంటికి రెప్పలా కాపాడుకునే సిబ్బంది ఉనికే లేదు. దీంతో ఏళ్ల తరబడి వీటి నిర్వహణ అటకెక్కింది. ప్రాజెక్టుల వద్ద ఉన్న క్వార్టర్స్ కూడా శిథిలావస్థకు చేరుకోగా ప్రాజెక్టు కట్టపై పిచ్చి మొక్కలు పెరికే దిక్కు లేకుండా పోయింది. ఇక కట్టపై ఉన్న విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ప్రాజెక్టు పొంతాలన్నీ పిచ్చి మొక్కలతో చిట్టడవులను తలపిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆలనా, పాలనా విస్మరించండంపై ప్రజలు, రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఒక మేజర్, నాలుగు మైనర్, రెండు మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. నీటి పారుదల శాఖ లెక్కల ప్రకారం అయిదు వేల ఎకరాల ఆయకట్టు (సాగు విస్తీర్ణం) ఉంటే మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా, 5 వేల నుంచి 25 వేల ఆయకట్టు ఉంటే మధ్య తరహా ప్రాజెక్టు, 25 వేలకు పైన ఉంటే మేజర్‌గా ప్రాజెక్టుగా పిలుస్తున్నారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాలు ఉన్న హంద్రీ-నీవా ప్రాజెక్టు మేజర్‌గా, నిమ్మనపల్లె బాహుదా 2,800 ఎకరాలు, తంబళ్లపల్లె పెద్దేరు 4,300 ఎకరాలు, పింఛా 3,773 ఎకరాలు, ఝరికోన 4,900 ఎకరాలు మేజర్ ప్రాజెక్టుగా, ఇక వెలిగల్లు 24 వేలు, అన్నమయ్య 22,500 ఎకరాల సాగుతో మధ్యతరహా ప్రాజెక్టులుగా పిలుస్తున్నారు. ఇందులో వరదలతో అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు కొట్టుకుపోగా పింఛా ప్రాజెక్టుకు మాత్రం మరమ్మతులు చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు అతీగతీ లేకుండాపోయింది. ఇటీవల నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టు నిండిపోయింది. మిగులు జలాలను బయటకు పంపే ప్రయత్నంలో రెండో గేటు మొరాయించింది. మొత్తం ఆరు గేట్లు ఉండగా, రెండు, నాలుగో నెంబర్ గేట్లను కొంతమేర పైకి ఎత్తి నీటిని బయటకు వదిలారు. రెండో గేటును ఎత్తే క్రమంలో ఒకవైపు సగంలో నిలిచిపోయింది. తర్వాత ఆ గేటును అతికష్టం మీద కిందకు దింపారు. పైప్రాంతంలో మదనపల్లె ఏరియాలో ఎక్కడైనా అనుకోని రీతిలో చెరువులకు ప్రమాదం జరిగితే బాహుదా పరిస్థితి ఏంటనే చర్చ ఆ శాఖ అధికారులలో నడుస్తోంది. గేటుకు అటు, ఇటు వైపున ఏర్పాటు చేసిన (గ్రూవ్) గాడికి, గేట్లను ఎత్తే ఇనుప తాడు (రోప్) గ్రీసింగ్ చేస్తూ రెండు, మూడు నెలలకోసారి మోటార్లు లేదా మాన్యువల్‌గా గేట్లను ఎత్తి పరీక్షిస్తుండాలి. లేకుంటే ఎండకు గ్రీసు ఆరిపోయి తుప్పు పట్టి గాడిలో ప్లేటు ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. నిన్నటి పరిస్థితి కూడా అదేనని చెబుతున్నారు. ఇప్పటికీ రెండో గేటుకు రోప్ లూజ్‌గానే వుంది. దీనిని సరిచేయడానికి నీరు అడ్డుగా ఉందని అలానే వదిలేశారు. ఇక్కడ ఏడుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరు. అయితే ఇటీవల తాత్కాలికంగా ప్రైవేటు వ్యక్తిని నియమించారు. అలాగే నిమ్మనపల్లె-మదనపల్లె మార్గం నుంచి ప్రాజెక్టుకు వెళ్లే మార్గం మట్టిరోడ్డు గుంతలమయం అయింది. ప్రాజెక్టు కట్ట సహా పరిసరాలన్నీ పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఎలక్ట్రికల్, విద్యుత్ దీపాల నిర్వహణ లేక నీరుగారిపోతోంది. అక్కడున్న సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ చిన్నపాటి రిపేర్లు, తదితర ఖర్చులన్నీ సిబ్బంది చేతుల నుంచే భరించాల్సి వస్తోంది.

పెద్దేరు ప్రాజెక్టుకు గేటు వ్యవస్థ లేదు. స్పిల్‌వే మార్గం గుండా ఓవర్ ఫ్లో అవుతోంది. అయితే కట్టలోపలి భాగంలో ఇన్‌స్పెక్షన్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ సొరంగ మార్గంలో కుడి, ఎడమ కాలువలకు నీరు వదలడానికి రెండు గేట్లు ఏర్పాటు చేశారు. అలాగే కట్ట లోపలి భాగంలో లీకేజీ నీటిని బయటకు పంపడానికి కట్టకు ఆనుకుని ఇటు, ఇటు ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ గేట్లతో పాటు లోపలి వ్యవస్థ నిర్వహణ కూడా అధ్వానంగా మారింది. లోపల విద్యుత్ సౌకర్యం ఉన్నా నిర్వహణ లేక వదిలేశారు. దీంతో సిబ్బంది లోపలికి వెళ్లి పర్యవేక్షణ చేసే పరిస్థితే లేకుండా పోయింది. లోపలి భాగం మొత్తం గబ్బిలాలు ఆక్రమించినట్లు చెబుతున్నారు. దీంతో కట్టలోని లోపాలు, లీకేజీలను గుర్తించే అవకాశమే లేదు. ప్రాజెక్టు ఏరియా మొత్తం కంపలు, చెట్లతో చిట్టడవిని తలపిస్తోంది. వర్షాకాలంలో ప్రాజెక్టు సందర్శనకు వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన పార్కు, అందులోని ఆట వస్తువులు పాడైపోయాయి. ఇక సిబ్బంది నివాసం ఉండటానికి అప్పట్లో నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయి. ఇక్కడ అన్ని విభాగాల సిబ్బంది కలిపి మొత్తం ఎనిమిది మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక లష్కర్ మాత్రమే ఉంటున్నారు. ఇదీ స్థూలంగా మన ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ పరిస్థితి. రూ.కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టు నిర్మించే పరిస్థితి లేకపోయినా ఉన్న వాటిని కాపాడుకోవడానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.



సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- పరిశీలించిన ముఖ్యమంత్రి భద్రతాధికారులు, కలెక్టర్, ఎస్పీ

చిన్నమండెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 12వ తేదీ చిన్నమండెం మండలానికి రానున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం మొత్తం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి భద్రతాధికారులతో పాటు కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తదితరులు ముఖ్యమంత్రి దిగే హెలిప్యాడ్, భద్రతా అంశాలు, గృహ ప్రవేశాలు చేయనున్న మాలేపాటి హేమలత, షేక్ ముంతాజ్‌బేగం గృహాలను కలెక్టర్, ఎస్పీలతో కలిసి సీఎం భద్రతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.



నూతన గృహాలను పరిశీలిస్తున్న సీఎం భద్రతాధికారులు, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశానికి చేసిన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెలిప్యాడ్ దిగిన దగ్గర వీఐపీలు ముఖ్యమంత్రిని కలుసుకుంటారు. అనంతరం బెంగుళూరు జాతీయ రహదారి ఆనుకుని టీటైం వెనుకాల ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశమై వారి నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను విన్న అనంతరం పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం మండల కేంద్రంలో షేక్ ముంతాజ్‌బేగం ఇంటికి వెళ్లి అక్కడ వారి సమస్యలు తెలుసుకుని వారితో కలిసి నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అక్కడ నుంచి బాహాజీనగర్‌కాలనీ, దేవగుడిపల్లె మధ్యలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో తొలుత పీ4కు సంబంధించి అనంతరం ప్రజావేదికలోని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. బహిరంగ సభ అనంతరం తిరుగు ప్రయాణమవుతారు. ముఖ్యమంత్రి పర్యటనల ఏర్పాట్లలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, ఎస్బీ సీఐ రాజారమేశ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గొప్ప మహనీయుడు సీపీ బ్రౌన్

- ఘనంగా సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు



సీపీ బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సముద్ధరణకు విశేష కృషి చేసిన మహనీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) అని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సీపీ బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1798 నవంబరు 10న కలకత్తాలో జన్మించిన సీపీ బ్రౌన్ 1817లో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరి 1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టర్‌గా కూడా పనిచేశారన్నారు. ఆయన కేవలం భాషా పరిశోధకుడిగానే కాక తెలుగు, సంస్కృతం, హిందీతో సహా అనేక భారతీయ భాషలకు ఆంగ్ల అనువాదకుడిగా పేరు గాంచారన్నారు. 1865లో లండన్ యూనివర్శిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితులై తెలుగు భాష కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ జి.శంకరమల్లయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాల సాధనకు కృషి

- కేజీబీవీ ప్రిన్సిపాళ్ల సమావేశంలో రాష్ట్ర సంచాలకుడు దేవానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేజీబీవీ రాష్ట్ర సంచాలకుడు దేవానందరెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) రాష్ట్ర సంచాలకులు డి.దేవానందరెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో జిల్లాల్లోని 22 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపల్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు జూలై 15 నుంచే విజయపథం కార్యక్రమాన్ని ప్రారంభించామని, దానిని పటిష్ఠంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్స్‌పై ఉందన్నారు. గతంలో పరీక్షలకు ముందు మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించేవారని, ప్రస్తుతం మాత్రం సంవత్సరం ప్రారంభం నుంచే రోజువారీ పరీక్షలు ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్స్ వంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రతిభ గల విద్యార్థులను మరింత ప్రోత్సహించి షైనింగ్ స్టార్ అవార్డ్ సాధించే దిశగా పనిచేయాలన్నారు. 9వ తరగతి విద్యార్థులకు వారంలో ఒక రోజు పదో తరగతి పాఠ్యాంశాలను బోధించి వాటిపై పరీక్ష పెట్టాలన్నారు. ఫలితంగా వచ్చే ఏడాది 10వ తరగతిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. పిచ్చిమొక్కలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం వండేటప్పుడు, వడ్డించేటప్పుడు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో అన్ని పాఠశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జీసీడీవో సుమతి, అసిస్టెంట్ జీసీడీవో యశోద, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్, జనార్దన్, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

జానెడు గూడు కోసం బారెడు తిప్పలు

- ఏపీఎస్ఆర్టీసీ సొసైటీ భూమి ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జానెడు గూడు కోసం బారెడు తిప్పలు పడుతున్నామని పీలేరులోని ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు. చాలీచాలని జీతాలతో కొనుగోలు చేసిన తమ సొసైటీకి చెందిన భూమి అన్యాక్రాంతం అవుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం రాయచోటిలో జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. ఏపీఎస్ఆర్టీసీ పీలేరు డిపోలో పనిచేస్తున్న సిబ్బందికి ఇళ్ల స్థలాల కోసం 2013లో కొంతమంది అధికారులు, కార్మిక సంఘ నాయకులు కలిసి హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసి దాని పేరిట పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ ప్రాంతంలో దాదాపు 12 ఎకరాల భూమి సేకరించారన్నారు. అందుకుగాను డిపోలో పనిచేస్తున్న కార్మికులు, అధికారులు ఒక్కొక్కరి వద్ద రూ.40 వేల నుంచి రూ.1,92,000ల వరకు వసూలు చేశారన్నారు. అయితే అప్పట్లో జరిగిన భూకొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని పలువురి ఫిర్యాదు మేరకు సొసైటీ ఏర్పాటు చేసిన వారిపై కేసులు నమోదయ్యాయన్నారు. అనంతరం కొంతమంది ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఆ భూములను అభివృద్ధి చేసి లక్కీడిప్ ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. అయితే లక్కీ డిప్‌లో ఇళ్లు పొందిన వారు కొంతమంది మృతి చెందగా, మరికొంత బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని, కొంతమంది ఆర్థిక ఇబ్బందుల వల్ల కట్టుకోలేకపోయారన్నారు. అలా ఖాళీగా ఉన్న భూములపై ఇటీవల కొంతమంది ఆక్రమణదారులు కన్నేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూములను పూర్తిగా సొసైటీకి అప్పగించాలని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో గోవిందు, డీఆర్ నాయుడు, పురం లక్ష్మయ్య, వీఆర్‌రెడ్డి, వీఆర్ గోపాల్, వీఎస్‌రెడ్డి, ఎంఆర్ మూర్తి, మోహన తదితరులు పాల్గొన్నారు.

కనసానివారిపల్లెలో ట్రైనీ కలెక్టర్‌ల పర్యటన



కనసానివారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో ట్రైనీ కలెక్టర్‌లు

కురబలకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లెలో ఆరుగురు ట్రైనీ కలెక్టర్‌లు సోమవారం పర్యటించారు. 2024-25కు బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్‌లు విధుల నిర్వహణలో శిక్షణ తీసుకునే కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాకు విచ్చేశారు. వీరిని కలెక్టర్ మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు అటాచ్ చేయడంతో మదనపల్లె డివిజన్ పరిధిలో పర్యటించారు. శిక్షణలో భాగంగా వీరు కనసానివారిపల్లె సచివాలయం, రైతు సేవా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్, ప్రాథమిక పాఠశాల తదితర వాటిని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన గర్భిణులు సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, గ్రామీణ ప్రాంత స్థితిగతులు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల సేవలు, పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర వాటిని ప్రజలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల, గ్రామస్థాయి అధికారులతో సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం రీసర్వే పనులపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి అంశంపై చర్చించి తెలుసుకోవడంతో పాటు పలు రకాల సలహాలు, సూచనలు తెలిపారు. అనంతరం కనసానివారిపల్లె పంచాయతీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు ప్రతివ లామా, హరిప్రసాద్ పోతరాజు, ఆశి శర్మ, విబోర్ భరద్వాజ్, పాటిల్ కృష్ణ, ఆనంద్ ప్యారేలాల్, ఎంపీడీవో గంగయ్య, సర్పంచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియులకు దానగుణం.. దయాగుణం

● రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు



మాట్లాడుతున్న క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు

రైల్వేకోడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దానగుణం, దయాగుణం కల్గిన వారు క్షత్రియులని, అందరూ ఐక్యంగా ఉండి పేదల తరపున పోరాడాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు అలియాస్ సూరి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన క్షత్రియ గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షత్రియులు కలసికట్టుగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. క్షత్రియులు దళిత, గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటాలు చేయాలన్నారు. క్షత్రియ పేద విద్యార్థుల చదువులు, ఉద్యోగాలకు ప్రయత్నించాలన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల్లో ఉన్న క్షత్రియులు అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరంగా ఉండి హక్కులను సాధించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. క్షత్రియులు ఏ పార్టీలో ఉన్నా క్షత్రియ సేవ ఆగిపోకూడదన్నారు. ప్రస్తుతం అన్ని కులాల వారు తమ ఉనికిని కాపాడుకునేందుకు హక్కులు కావాలని పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలసి క్షత్రియుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లి ప్రతాప్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న క్షత్రియులు అందరూ పోరాట పటిమ కల్గిన వారే అని తెలిపారు. గ్రామాల్లో అన్ని కులాలను కలుపుకునిపోవాలన్నారు. కార్యక్రమంలో క్షత్రియ నాయకులు ముద్దలూరు చంద్రరాజు, ప్రముఖ లాయర్ అద్దెపల్లె వెంకట్రామరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్ రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రాజంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్తవరం చెర్లోపల్లె ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బయ్య, పీడీఎం ఈశ్వర్‌నాయక్ తెలిపారు. ఈ నెల 8న కడప మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో హస్తవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 ఖోఖో బాలికల క్రీడా విభాగంలో పి.దీక్షిత, పి.మానస, పి.మధుప్రియ, బాలుర విభాగంలో ఎ.హర్షవర్దన్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు అనకాపల్లె జిల్లాలో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. హస్తవరం, చెర్లోపల్లె ఉన్నత పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌నాయక్ మూడు నెలల కిందటే నియమితులైనా తమ పాఠశాల విద్యార్థులను జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

● రూ.40 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం



అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ

మదనపల్లె అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసి అతని నుంచి రూ.40లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ పి.మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నందిగానిపల్లె గ్రామం కొక్కంటి క్రాస్‌కు చెందిన పసుపులేటి సూరిబాబు కుమారుడు పసుపులేటి సాయికుమార్(30) దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని, ఇందులో మదనపల్లె పట్టణంలో నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్, తదితర చోట్ల దొంగతనాలు చేసి బంగారు నగలు అపహరించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట వద్ద ఆర్కే టైల్స్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించండి

● జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



పీజీఎస్ఆర్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సంక్లిష్టమైన అర్జీలను అలాగే వదిలిపెట్టకుండా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. గుర్రంకొండ మండలం రామిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగభూషణమ్మ తనకు ఆర్టీసీ బస్సు ప్రమాదం వలన కాలు విరిగిందని, చక్రాల కుర్చీకే పరిమితమయ్యానని తనకు వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరారు. సుండుపల్లెకు చెందిన బొమ్మిరెడ్డి భాగ్యమ్మ తన భర్త మరణించాడని తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరింది. బి.కొత్తకోటకు చెందిన కె.చైత్ర తాను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తన కుమారుడు కె.పునీత్ బి.కొత్తకోటలోని ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడని తల్లికి వందనం డబ్బులు ఇంతవరకు జమకాలేదని విచారణ జరిపి తల్లికి వందనం డబ్బులు ఇప్పించాలని కోరింది. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్ డబ్ల్యు ఎస్.లక్ష్మీపతి, డ్వామా పీడీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నాడు ఘనం.. నేడు దయనీయం...

● ఐఏఎస్‌ల పాఠశాలకు ఆదరణ కరవు
● శతాబ్ది ఉత్సవాలకు దూరం
● షిఫ్ట్ పద్ధతిలో పాఠశాల, కళాశాల తరగతులు
● కూలేందుకు సిద్ధంగా భవనాలు



నందలూరులోని సరస్వతి నిలయం

నందలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాల నిర్మించి వంద సంవత్సరాలు పైబడింది. ఎంతోమందికి ఉన్నతస్థాయి కల్పించిన ఆ పాఠశాల నేడు దయనీయ స్థితిలో ఉంది. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలువురు విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేసింది. ఈ పాఠశాలలో చదివిన ప్రతిఒక్కరు ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొందరు ఐఏఎస్‌లుగా ఇంకొందరు ఐపీఎస్‌లుగా మరికొందరు వివిధ రకాల ఉన్నతాధికారులుగా, రాజకీయ నాయకులుగా, ఎమ్మెల్యేలుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అలాంటి పాఠశాల నేడు అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి దూరమైంది. రాజంపేట నియోజకవర్గాన్ని నాటి నుంచి నేటి వరకు పాలించిన ఒకరిద్దరు శాసనసభ్యుల మినహాయించి మిగతా వారందరూ మండలవాసులు కావడం గమనార్హం. దీంతో పాటు పాఠశాల ఇప్పటికే నూతన సోకులతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అభివృద్ధిలో అడుగు వేయాల్సి ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదు కానీ ప్రస్తుతం ఈ పాఠశాల లోపలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. కాలం చెల్లిన భవనాల మధ్య బిక్కు బిక్కుమంటూ చదువు నెట్టుకొస్తున్నారు. 1908లో ఏర్పాటు చేసిన ఈ జిల్లా పరిషత్ పాఠశాల నేడు దయనీయ స్థితికి చేరుతోంది. 1968 మే 3వ తేదీ అప్పటి ఎమ్మెల్యే బండారు రత్నసభాపతి, అప్పటి కడప జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డి సమయంలో నిర్మించిన సైన్సు బ్లాక్ భవనాలు ఏ సమయంలో కూలుతాయోనని అటు విద్యార్థులతో పాటు ఇటు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. పరిపాలనా భవనం కూడా కాలం చెల్లింది. ఇప్పటికే స్లాబు పెచ్చులూడి పడుతుండడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం నెట్టుకొస్తున్నారు. పాఠశాల దుస్థితిని గమనించిన పలువురు మండల నేతలు కాలం చెల్లిన భవనాలను చెల్లించి నూతన భవనాలను నిర్మించాలని పలుమార్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు విన్నవించినా ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడం బాధాకరం. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కాలం చెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు. కొంతమంది పూర్వపు విద్యార్థులు పాఠశాలలో స్టేజ్ నిర్మాణాన్ని చేపట్టారు. మరికొందరు విద్యార్థుల అపూర్వ కలయికలో డెస్కులు, ఇతర సామగ్రిని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులకు ఉన్న ఆసక్తి సైతం అధికారులకు లేకపోవడం ఏమిటని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎప్పుడు కూలుతుందో తెలియని రెండో అంతస్తు భవనం

పాఠశాలలోనే కళాశాల తరగతులు

ఉన్న భవనాలు అంతంత మాత్రమే. మరి ఇలాంటి తరుణంలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గతంలో పాఠశాల తరగతులు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించే వారు. కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాఠశాలలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠశాల విద్యార్థులకు, మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు పూర్తి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల నూతన భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ అది మరుగునపడిపోయింది. ఏది ఏమైనా టీడీపీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు నందలూరు పాఠశాల, కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల వాసులు, విద్యార్థులు కోరుతున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం



ఉమ్మడి కడప జిల్లాలో ఐఏఎస్‌ల పాఠశాలగా ఖ్యాతి గడించిన నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రారంభించి 115 ఏళ్లు పూర్తయినా నేటికి శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం. ఐదుగురు ఐఏఎస్‌లు, రిజర్వు బ్యాంకు గవర్నర్, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పూర్వ విద్యార్థులు ఎందరో. ఇంతటి ఘనకీర్తి కలిగిన పాఠశాలలో వసతులు లేమి పీడిస్తోంది. దీనిపై చొరవ చూపి పాఠశాల ఉత్సవాలు నిర్వహించాలి.

\- డాక్టర్ రాంప్రసాద్, రాజంపేట బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్, నందలూరు

క్రీడామైదానం కేటాయించాలి



పాఠశాలకు కేటాయించిన క్రీడా మైదానం 2 కి.మీ. దూరంలో ఉండడం వల్ల విద్యార్థులకు నిరుపయోగంగా మారింది. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు కొరవడుతున్నాయి. తల్లిదండ్రులు, గ్రామ ప్రజల, విద్యార్థుల కోరిక మేరకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

\- సమ్మెట శివప్రసాద్, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

కన్నతల్లే హంతకురాలు

● బిడ్డను చంపించి.. అంత్యక్రియలకు హాజరు
● ఎంబీఏ విద్యార్థి జయప్రకాష్‌రెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులు
● తల్లితో పాటు ఏడుగురు అరెస్టు




నిందితులను చూపుతున్న సీఐ గోపాల్‌రెడ్డి, (ఇన్‌సెట్లో) హత్యకు గురైన జయప్రకాశ్‌రెడ్డి

బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కన్నతల్లే కాలాంతకురాలైంది... స్వార్థం ముందు పేగుబంధం చిన్నబోయింది... బిడ్డలే ఆస్తి, బిడ్డల సుఖం, బిడ్డలే సర్వస్వం అనే మాటలను పక్కన బెట్టి ఆస్తి ముఖ్యం.. సుఖమే ప్రధానం అన్నట్టు మాతృత్వానికే మచ్చ తెచ్చింది ఈ మహాతల్లి. కని, పెంచిన కనికరం మరిచి కసాయిగా మారింది. పెళ్లీడుకొచ్చిన కొడుకును పథకం ప్రకారం కడతేర్చి ఏమీ తెలియనట్లు అంత్యక్రియలకూ హాజరైంది. అందరూ అనుమానించినట్టే ముద్దాయిగా నిలిచింది.

బి.కొత్తకోట మండలం గోళ్లపల్లి పంచాయతీ పరిధిలోని గుడిసివారిపల్లెలో ఈ నెల 7న జరిగిన బీటెక్ విద్యార్థి తిరుమలయ్యగారి జయప్రకాష్‌రెడ్డి హత్య కేసులో కన్నతల్లి శ్యామలమ్మ ప్రధాన నిందితురాలని, సుపారీ ఇచ్చి తన పెద్ద కొడుకును కడతేర్చినట్టు పోలీసులు బయటపెట్టారు. మాతృత్వం మంటకలిసిన ఈ ఉదంతం గురించి సోమవారం సీఐ గోపాల్‌రెడ్డి వివరాల మేరకు... గుడిసివారిపల్లికి చెందిన లేట్ తిరుమలయ్యగారి వెంకటశివారెడ్డికి భార్య శ్యామలమ్మ(41), కుమారులు జయప్రకాష్‌రెడ్డి(24), గిరివర్ధన్ రెడ్డి(21) ఉన్నారు. వారిలో జయప్రకాష్‌రెడ్డి అంగళ్లు వద్దనున్న మిట్స్ కాలేజీలో ఎంబీఏ సెకండ్ ఇయర్ చదువుతుండగా, గిరివర్ధన్‌రెడ్డి గుంటూరులో సీఏ కోచింగ్‌లో వున్నాడు. తండ్రి నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. అయితే నాలుగు నెలలుగా తల్లి శ్యామలమ్మకు, పెద్దకొడుకు జయప్రకాష్‌రెడ్డికి విభేదాలు వచ్చాయి. తనకు ఆస్థి పంచాలని కొడుకు పట్టుబట్టడంతో పలుమార్లు గొడవపడ్డారు. తల్లి విషయంలో మనస్థాపం చెందిన జయప్రకాష్‌రెడ్డి తాగుడుకు అలవాటు పడి కళాశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే వుంటున్నాడు. బిడ్డకు ఆస్తి పంచడం ఇష్టం లేని తల్లి కొన్నిరోజులుగా తన పుట్టినిల్లు మదనపల్లి సమీపంలోని జవుకుపల్లిలో వుంటోంది. గొడవను సద్దుమణచడానికి ఆస్తి పంచడానికి బదులు కన్నకొడుకునే చంపించాలని తీర్మానించుకుంది. ఇందుకోసం తనకు బాగా పరిచయం ఉన్న పీటీఎం మండలం నాగన్నకోటకు చెందిన ఆవులకుంట మహేశ్(32)ను పురమాయించింది. తన పెద్దకొడుకును చంపాలని ఎంత ఖర్చు అయినా ఇస్తానని చెప్పింది. రూ.10 లక్షలు ఇవ్వాలని మహేశ్ కోరగా రూ.6లక్షలకు డీల్ కుదుర్చుకుంది. తనకు తెలిసిన 6మంది యువకుల సాయంతో మహేశ్ పథకాన్ని అమలు చేశాడు. ఈ నెల 6న రాత్రి గుడిసివారిపల్లికి వెళ్లి జయప్రకాష్‌రెడ్డిని తన బొలెరోలో ఎక్కించుకొని గోళ్లపల్లి వద్దనున్న వైన్‌షాపులో మద్యం తీసుకొని తుమ్మణంగుట్ట ఫ్లైఓవర్ వద్దకు తీసుకెళ్లి బాగా తాగించాడు. మళ్లీ అదే వాహనంలో ఎక్కించుకొని బయలుదేరగా ముందస్తు ప్లాన్ ప్రకారం రామానాయునికోటకు చెందిన జి.భానుప్రకాశ్(23), ములకలచెరువుకు చెందిన సాయిగణేశ్(22), సి.ఆకాశ్(22) ఒక ద్విచక్రవాహనంలో, సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మార్యాోరివారిపల్లికి చెందిన పి.కిరణ్(23), సి.రాహుల్ ప్రమోద్(20), చెండ్రాయునిపల్లికి చెందిన హరిప్రసాద్(19) మరో బండిలో అక్కడికి చేరుకొని బొలెరోను అనుసరించారు. మహేశ్ ఆ వాహనాన్ని గుంతావారిపల్లి వైపు మళ్లించగా కొద్ది దూరం వెళ్లాక, జయప్రకాష్‌రెడ్డిని కిందకు దింపి వెంట తెచ్చుకున్న బేస్‌బాల్ బ్యాట్‌తో విచక్షణారహితంగా దాడిచేశారు. తీవ్రంగా గాయపరిచి అదే బొలెరోలో పడేశారు. అనంతరం జాతీయరహదారి గుండా వెళ్లి ఎక్కడో ఓచోట పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని చూశారు. వీలు పడకపోవడంతో తిరిగి గుడిసివారిపల్లి వద్దకు తీసుకొచ్చి వాహనంలోంచి కిందకు లాగి కొన ఊపిరితో ఉన్న జయప్రకాష్‌రెడ్డి తలపై పెద్ద బండరాయితో మోది చంపేశాడు. ఈ విషయాన్ని తల్లి శ్యామలమ్మకు తెలిపాడు. దీంతో చిన్నకొడుకుతో పాటు అంత్యక్రియలకూ హాజరైంది. రంగంలోకి దిగిన పోలీసులు క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టారు. తల్లి శామలమ్మపైనే అనుమానాలు రావడంతో సాంకేతికత సాయంతో హత్యకేసును ఛేదించారు. సూత్రధారి అయిన కన్నతల్లి శ్యామలమ్మతో పాటు మరో ఆరుగురిని ఇతర చోట్ల అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు



నిందితులను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు హత్యకు వాడిన కారును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం స్థానిక మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆగస్టు 15న మదనపల్లె మండలం సీటీఎం సమీపంలో బ్రిడ్జి వద్ద వ్యక్తి మృతిచెందిన విషయం అప్పట్లో కలకలం రేపింది. కదిరి రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా పోలీసులు విచారణలో ఇది హత్యగా గుర్తించి ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. బసినికొండకు చెందిన పఠాన్ ఆసీఫ్‌ఖాన్ (40), దేవళంవీధికి చెందిన షేక్ మౌలా (33), త్యాగరాజవీధికి చెందిన సయ్యద్ సుల్తాన్(31), దేవళంవీధికి చెందిన టీపీ మహమ్మద్ రబ్బానీ, అప్పారావుతోట, సైదాపేట్‌కు చెందిన షేక్ సాదిక్ (22) అందరూ మంచి స్నేహితులని, అందరికీ మద్యం, గంజాయి తాగడం అలవాటు ఉందని తెలిపారు. ఈ క్రమంలో వీరికి వెస్ట్‌బెంగాల్ నుంచి వచ్చి కురబలకోట మండలం అంగళ్లు వద్ద కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్న ఎస్‌కే ఖదీర్‌తో పరిచయం ఏర్పడిందని, ఇతను అప్పుడప్పుడూ ఊరి నుంచి వచ్చేటప్పుడు గంజాయి తెచ్చి వీరికి కేజీ రూ.24 వేలకు అమ్మేవాడన్నారు. ఈ విషయం తెలిసిన ఆసీఫ్‌ఖాన్ గంజాయి వారంలోపు తెచ్చి ఇవ్వాలని ఖదీర్‌కు రూ.50వేలు ఇచ్చారు. అయితే నెల రోజులు గడుస్తున్నా తమకు గంజాయి ఇవ్వనందున ఆగస్టు 15న కారులో అంగళ్లు వెళ్లి ఖదీర్‌ను కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు అడవిలోని నీలగిరి చెట్ల మధ్యకు తీసుకెళ్లి బాగా కొట్టారు. అనంతరం మదనపల్లెలోని ఆసీఫ్‌ఖాన్ ఇంట్లో ఉంచగా అదేరాత్రి ఖదీర్ మృతి చెందాడని గమనించి సుల్తాన్ సూచనల మేరకు ఆసీఫ్‌ఖాన్, షేక్‌మౌలా ఆటోలో మృతదేహాన్ని సీటీఎం రైల్వే రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారు. అనంతరం కదిరి రైల్వే పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి మదనపల్లె వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు అన్సర్‌బాషా, శివకుమార్, టూటౌన్ ఎస్ఐ రహిముల్లా నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా సయ్యద్ సుల్తాన్‌పై గతంలో విజయవాడ, పీలేరు, తిరుపతి, వాయల్పాడు, తదితర పోలీసుస్టేషన్లలో 18 కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కలికిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న ఒక తోటలో సోమవారం ఉదయం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో అతను ఇందిరమ్మ కాలనీకి చెందిన ముల్లంగి రమేశ్(55)గా గుర్తించారు. అయితే రమేశ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అనారోగ్యంతో మరణించాడా లేక పాత కక్షల వల్ల ఎవరైనా ఏమైనా చేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ...



మృతి చెందిన కృష్ణమనాయుడు

చిన్నమండెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అడవి పందులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు విద్యుత్ కనెక్షన్ తొలగించే యత్నంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని చాకిబండలోని వండాడి కొండ సమీపంలో అడవి పందులు పట్టేటందుకు ఆదివారం రాత్రి రాయచోటి మండలం మాధవరం గ్రామం కొండకిందపల్లెకు చెందిన పేయల కృష్ణమనాయుడు (47), పేయల మహేశ్‌నాయుడు, బాబు విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున విద్యుత్ లైన్ తప్పించేందుకు వెళ్లిన కృష్ణమనాయుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

రామసముద్రం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించకుండా పోయిన కేసు విచారణలో భాగంగా ఆ బాలికను నిందితుడు వివాహం పేరుతో ప్రలోభ పెట్టినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


వృద్ధురాలిపై అఘాయిత్యం ?

బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు(64)పై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అతిగా మద్యం తాగిన ఆ యువకుడు వృద్ధురాలి ఇంటిలోనికి ప్రవేశించి ఒంటరిగా వున్న సమయంలో ఆమెపై దాడి చేసి అత్యాచారానికి ఒడిగట్టినట్లు సమాచారం. బాధితురాలిని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకొని వెళుతున్న మహిళపై ఓ ఆకతాయి ద్విచక్రవాహనంలో వచ్చి వేధింపులకు గురిచేయంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివాహిత తన పొలం వద్దకు నడిచి వెళ్తుండగా అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న షేక్ ఇమ్రాన్ వివాహితను చూసి అసభ్యకరంగా సైగలు చేస్తూ వేధింపులకు గురిచేశాడు. దీంతో ఆమె 112కు ఫిర్యాదు చేయగా షేక్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శివకేశవుల అలంకారంలో అఘోరలింగేశ్వరుడు



వీరభద్రాలయంలో అఘోరలింగేశ్వరుడు

రాయచోటిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అఘోర లింగేశ్వరుడు శివకేశవుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వివిధ రకాల పుష్పాలు గంధంతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయ చోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వీర భద్రాలయానికి చేరుకొని శివలింగం, త్రిశూలం ఆకారంలో కార్తీక దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

వర్షంతో పూల రైతు కుదేలు

● తోటల్లో నిలిచిన వర్షపు నీరు

● వ్యాపిస్తున్న తెగుళ్లు.. రైతుల బెంబేలు



మల్లెతోటలో జోరెత్తిన వర్షపునీరు

దువ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతోపాటు వీడకుండా పడిన వర్షాలతో పూలతోటల్లో నీళ్లు నిలబడి తెగుళ్లు సోకాయి. దీంతో పూల చెట్లు కొన్ని కుంచించుకుపోగా, మరికొన్ని కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని కానగూడూరు, క్రిష్ణంపల్లెతో పాటు ఐ.బోయనపల్లె, నారాయణపల్లె గ్రామాల్లో పూలతోటలు సాగుచేస్తారు. ఈ ప్రాంతాల్లో పూల సాగుతో కొందరు రైతులు, వాటి విక్రయాలతో మరికొందరు జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగు చేసిన మల్లె, సంపంగి, కాగడాలు, కనకాంబరాల తోటలు ఎడతెరిపి లేని వానలతో కుచించుకుపోయాయి. 35 శాతం దిగుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ సీజన్‌లో కానగూడూరులో ఉన్న పూలమార్కెట్ నిత్యం కళకళలాడేది. ప్రస్తుతం రైతులు పూలు తీసుకురాకపోవడంతో కళావిహీనంగా తయారైంది.



వర్షంతో పూలతోటల్లో కింద వాడిన రెమ్మలు

తోటలు దెబ్బతిన్నాయి



కౌలుకు పొలం తీసుకుని నాలుగున్నర ఎకరంలో మల్లె, జాజితోటలు సాగు చేశాను. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయాను. నెల రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షంతో పూల తోటలు దెబ్బతిన్నాయి. అరకొరగా దిగుబడి వచ్చినా కూలీల ఖర్చులు కూడా రావడం లేదు.

- ఎన్.నరసింహులు, కానగూడూరు, పూల రైతు

26న విద్యార్థులతో మాక్ అసెంబ్లీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షంషుద్దీన్ తెలిపారు. అమరావతిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరగనుందన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, వారి వివరాలను పాఠశాల విద్యా కమిషనర్, మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో ప్రతి నియోజకవర్గం నుంచి ఒకరిని ఉన్నతాధికారులు తుది ఎంపిక చేయనున్నారని వివరించారు. ఈనెల 8వ తేదీ ప్రొద్దుటూరులో జరిగిన కార్యక్రమం ఎంపిక ప్రక్రియకాదని, అది కేవలం విద్యార్థులకు రాజ్యాంగం, సభా విధానం పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సన్నాహక కార్యక్రమం మాత్రమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ అవగాహన పెంపుదలే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా కడప ఎంఈఓ



రఫీక్ అహ్మద్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా కడప ఎంఈఓ హెచ్‌కె రఫీక్ అహ్మద్ ఎంపికయ్యారు. నవంబరు 11న ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో రఫీక్ అహ్మద్‌కు బహుమతి ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతులమీదుగా సన్మానం అందుకోనున్నారు. ఆయనకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపారు.

టిడ్కో ఇళ్లకు దరఖాస్తుల ఆహ్వానం



కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇళ్లు కల్పించే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఏపీ టిడ్కో పరిధిలో కడప నగరం ఎన్టీఆర్ నగర్ ప్రాజెక్టు కింద నిర్మించిన జీ+3ప్లాట్లకు సంబంధించిన లబ్దిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. 18ఏళ్లు పైబడిన వారు 15రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులు కడప నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సమర్పించాలన్నారు.

అందుబాటులో ఉన్న ఇళ్ల వివరాలు

జీఓఎంఎస్ నెంబర్ 39 ప్రకారం ఫేజ్-1 (శ్రీలక్ష్మీనగర్), ఫేజ్-2 (చలమారెడ్డిపల్లె) ప్రాంతాల్లోని ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 300 చ.అ. పూర్తి ఉచితమని తెలిపారు. 365 చ.అ. రూ.7.55 లక్షలు ఉంటుందని, కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.65 లక్షలు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. 430 చ.అ. రూ.8.55 లక్షలు ఉంటుందని.. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.90 లక్షల సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. 365 మరియు 430 చదరపు అడుగుల ఇళ్లకు బ్యాంకు రుణం తీసుకోకుండా స్వీయ చెల్లింపు చేసుకునే వెసులు బాటు కూడా ఉందన్నారు.

అర్హత ప్రమాణాలు

కడప నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారుల చిరునామా ఉండాలి. తప్పనిసరిగా మహిళ అయి ఉండాలి. కుటుంబానికి సొంతభూమి/ఇళ్లు ఉండకూడదు. వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించకూడదు. గతంలో కేంద్ర లేదా రాష్ట్ర హౌసింగ్ స్కీం లబ్ధి పొందకూడదు. సంవత్సరానికి సగటు విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు లోపుగా ఉండాలి. కుటుంబంలో నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి/పింఛన్‌దారుడు/ఔట్‌సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగి ఉండకూడదు.

దరఖాస్తుకు కావాల్సినపత్రాలు

లబ్ధిదారులు జీవిత భాగస్వామి/తండ్రి/తల్లి ఆధార్ కార్డులు, కుటుంబ రేషన్‌కార్డు, లబ్ధిదారు ఓటరుకార్డు.

ప్లాట్ కేటాయింపు విధానం

మొదట 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారుల వాటా చెల్లించిన వారికి ప్లాట్లు కేటాయిస్తారు. తదుపరి 300 చదరపు అడుగుల ఉచిత ఇళ్లకు కేటాయింపు జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు కడప నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు.

బ్రౌన్ జయంతి రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం హర్షణీయం

● వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్



ప్రసంగిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

కడప కల్చరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 227వ జయంతిని పురష్కరించుకుని బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో సోమవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపకులపతి తొలుత రాజీవ్‌మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశ మందిరంలో గల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుభాషా సాహిత్యానికి శాశ్వత వెలుగు నిచ్చిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. బ్రౌన్ నివశించిన బంగళా శిథిలాలను డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్థలదాత సంపత్‌కుమార్, జి.కృష్ణమూర్తి, జేసీ సుబ్బయ్య, ఎస్‌సీ రామసుబ్బారెడ్డి, కట్టా నరసింహులు లాంటి ప్రముఖులతో కలిసి బ్రౌన్‌స్మారక గ్రంథాలయమనే జ్ఞానసౌధాన్ని నిర్మించారన్నారు. వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి బ్రౌన్ అని కొనియాడారు. బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య రామనరసింహం మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ తెలుగుపై పట్టు సాధించి నిఘంటువుల నిర్మాణం చేస్తే తెలుగువారమైన మనం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ ఆంగ్లంపై మక్కువ పెంచుకోవడం అవివేకమన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, తెలుగు శాఖ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, ఎంఎం వినోదిని, పి.రమాదేవి, పుత్తా పుల్లారెడ్డి, పుత్తా బాలిరెడ్డి, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సరళ

చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని సచివాలయాల సిబ్బంది శిక్షణ ప్రత్యేకాధికారి, కాలహస్తి ఎంపీడీవో సరళ అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికాధికారి ఓబులమ్మ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర స్థాయి అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సరళ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుపీసీలను గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులుగా మార్చు కోవాలన్నారు. ప్రతి పంచాయతీలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని, తద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. ముఖ్యంగా ఎస్‌డబ్ల్యుపీసీలు కేవలం చెత్త సంపద కేంద్రాలుగా కాకుండా అందులో పలు రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకర వాతావరణం నింపి ఆరోగ్య సంపద కేంద్రాలు తీర్చి దిద్దుకోవాల న్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయా లన్నారు. ఈ శిక్షణలో డివిజనల్‌స్థాయి అధికారులు వారి పరి ధిలో ఉన్న సచివాలయాల సిబ్బందికి శిక్షణ విషయాలు వివరించి గ్రామ పంచాయతీల అబివృద్ధికి చేయాలన్నారు.

కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎల్‌డీవో రామాంజనేయులు, జిల్లా సమన్వయ అధికారి రమణారెడ్డి, డీఎల్‌పీవోలు నూర్జహాన్, విజయభాస్కర్, ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు, డీపీఆర్‌సీ, ఆర్పీలు, ఎఫ్‌టీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలు గీయాలి

● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలు మీ కుంచెల నుంచి జాలువారాలని, సృజనాత్మక ఆలోచనలకు కలాఖండాలు రూపొంది ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులకు ఉద్బోధించారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళా విభాగంలో వారం రోజుల ఇంక్ ఏ పేరుతో ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో శ్రీచరణిని దేశమంతా ఎలా గుర్తుంచుకుందో అలా మీ రంగంలో మీరు తయారు కావాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయుక్తమయ్యే, సమాజాన్ని సంస్కరించే పెయింటింగ్స్ మీ నుంచి ఆశిస్తున్నామన్నారు. చిత్ర కళాకారులు అంతర్ముఖులుగా ఉంటారని ప్రస్తుత యుగంలో అలా ఉంటే రాణించలేమన్నారు. ప్రతి చిత్రకారుడు తన బ్రాండ్‌ను బిల్డ్ చేసుకున్నప్పుడే పెయింటర్‌గా ఆర్థిక వనరులతో పాటు ఖ్యాతిని ఆర్జించవచ్చన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కంకణాల గంగయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పలుసూచనలు తెలియజేశారు. అనంతరం వైస్ చాన్సెలర్ బోర్డుపై పెయింటింగ్ వేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. తెలంగాణ, తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్ మేకింగ్ నిపుణులు చలపాక అప్పలాచారి విద్యార్థులకు శిక్షణ నైపుణ్యాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, బి.చిన్నరాయుడు, బి.ఈరప్ప, ఎం.వాసవి, ఎస్.చంటి, డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ కంపెనీలో కేబుల్‌వైరు చోరీ

కొండాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీలో కేబుల్‌వైరు చోరీకి గురయింది. కంపెనీలో ఆదివారం రాత్రి సుమారు 9000 మీటర్ల కేబుల్ వైరు చోరీకి గురయినట్లు కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేబుల్ విలువ సుమారు రూ.3,90,000 ఉంటుందని వారు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

భూతగాదా విషయమై ఇరువర్గాల ఘర్షణ

నిమ్మనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంపై జరిగిన ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. బండ్లపై పంచాయతీకి చెందిన మేకల లక్ష్మన్న, భార్య లక్ష్మమ్మ తమ పొలంలో పనుల చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వారి దాయాదులు మేకల రెడ్డెప్ప, భార్య వనజ ఆ భూమిలో తమకు కూడా భాగం వుందని వారిపై దాడి చేసి గాయపరిచారు.

నమ్మి వచ్చిన ఆదివాసీలకు చిత్రహింసలు

● ఏజెన్సీ నుంచి 15 మందికి విముక్తి ● స్వస్థలాలకు పంపిన బీజేపీ నేతలు



గిరిజనులను రైలుకు పంపిస్తున్న బీజేపీ నాయకులు

కడప మారుతీనగర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఊరు కానీ ఊరులో చేపలు పట్టేందుకు నమ్మి వచ్చిన ఆదివాసీ గిరిజన తెగకు చెందిన 15 మందికి తిండి తిప్పలు పెట్టకుండా తీవ్ర హింసకు గురిచేస్తున్న ఓ ఏజెన్సీ బారి నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు శివానాయక్‌లు కాపాడి సురక్షితంగా వారి స్వస్థలానికి పంపించారు. సోమవారం కడప రైల్వేస్టేషన్‌లో వారు మాట్లాడుతూ ఓ ఏజెన్సీకి చెందిన కొందరు పెద్ద మనుషుల ముసుగులో ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్‌లో గల 15 మంది ఆదివాసీ గిరిజన తెగకు చెందిన వారిని రప్పించి ఒంటిమిట్ట మండలం కోడుమూరు సమీపంలో గల నది ఒడ్డున గల అటవీ ప్రాంతంలో వుంచి తినడానికి తిండి పెట్టకుండా ఇబ్బందులకు గురిచేశార న్నారు. ఈ విషయం గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన తమ దృష్టికి తీసుకురాగా ఒంటిమిట్ట సీఐ బాబుకు తెలిపామన్నారు. ఆయన తక్షణమే స్పందించి వారిని అటవీ ప్రాంతం నుంచి బయటకు రప్పించారన్నారు. వారికి అండగా నిలిచి భోజనం, మంచినీరు అందజేసి వారిని విశాఖపట్నం రైలుకు పంపించామని తెలిపారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు



మురికి కాల్వను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

ముద్దనూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య లోపం కన్పించకూడదని జిల్లాపరిషత్ సీఈవో ఓబులమ్మ హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం సీఈవో పర్యటించారు. అందులో భాగంగా ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మురికినీటి కాల్వను పరిశీలించారు. కాల్వలో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. అలాగే ఇంటింటి చెత్తసేకరణపై క్లాప్ మిత్రల ద్వారా ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాల వద్ద మురికి నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాధాకృష్ణవేణికి ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, కార్యదర్శి సౌభాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీజీపీతో మంత్రి మండిపల్లి భేటీ



రాష్ట్ర డీజీపీతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీసు అధికారి హరీశ్ కుమార్‌గుప్తాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా భద్రత, యువజన కార్యక్రమాల సమన్వయం వంటి పలు అంశాలపై చర్చించారు.

ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు10(ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలన అధికారుల పని విధానాన్ని పరిశీలించడంలో భాగంగా శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు తన్మయి, హర్షవర్ధన్, తరుణ్‌కుమార్ యాదవ్, హర్షబాదై, డీ. ఆనంద్ సోమవారం మండలంలోని బీ.యర్రగుడి, కోనంపేట గ్రామాల్లో పర్యటించారు. రెవెన్యూ సమస్యలు, గ్రామాల అభివృద్ధిపై గ్రామ అధికారులపై అడిగి తెలుసుకున్నారు. కోనంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలపై ఆరా తీశారు. ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్డీ ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

రాయచోటిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విస్తరణ, గ్రామ స్థాయిలో రైతుల అవగాహన పెంపు, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి టీ. విజయ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, భవిష్యత్తులో రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో దీని పాత్రపై వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ మాట్లాడుతూ టీఐసీఆర్‌పీలు గ్రామ స్థాయిలో రైతులకు మార్గదర్శకులుగా వ్యవహరించాలని సూచించారు అనంతరం ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బీ. వెంకట మోహన్ మాట్లాడుతూ ఐసీఆర్‌పీలు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలు అత్యంత కీలకమన్నారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతుల వద్దకు చేర్చడం, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించడం వంటి అంశల్లో ఐసీఆర్‌పీలు ప్రధాన పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి సిబ్బంది, టీఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

సీఎంతో రేవూరి వేణుగోపాల్ భేటీ

నందలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థి నాయకుల ముసుగులో వైసీపీ నేతలు గంజాయి వ్యాపారం చేస్తున్నారని, అంతేగాక వైసీపీ విద్యార్థి విభాగం నాయకులతో వైఎస్ జగన్ సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రంలో విద్యార్థి, యువతను గంజాయి మత్తుకు అలవాటు చేయాలన్న ఉద్దేశంతో వైసీపీ విద్యార్థి విభాగానికి ట్రైనింగ్ ఇస్తున్నారన్నారు. వారిపై నిఘా పెట్టాలని తెలియజేశామన్నారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జరిగే నష్టాలపై విద్యార్థి, యువతలో చైతన్యం కలిగించేందుకు టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని ముఖ్య మంత్రికి తెలియజేశామన్నారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు.. మహిళకు గాయాలు

వీరబల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన వెళ్తున్న మహిళను ఢీకొని, పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో గాయపడిన అమృత అనే మహిళను రాయచోటి ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా బస్సులోని విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు

శివ నామ స్మరణతో మార్మోగిన శివాలయాలు



రాజంపేట: శివలింగం ఆకారంలో అమర్చిన ప్రమిదలు



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరుడు



చిట్వేలి: ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు ప్రసాదాలు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని గుండ్లూరు శివాలయం వద్ద భక్తులు దీపాలను వెలగించారు. అగస్త్యేశ్వరాలయంలో పురోహితులు పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శివలింగం భక్తులను ఆకట్టుకుంది. అన్నదానం చేశారు. ఆలయం వద్ద చెక్క భజన ప్రదర్శన ఆకట్టుకుంది.పట్టణంలోని శివాలయం, మందపల్లె పాలేశ్వరస్వామి మన్నూరు, ఊటుకూరు శివాలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పెనగలూరు : తూర్పుపల్లెలోని బోడమల్లేశ్వరస్వామిని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. జెట్టివారిపల్లెలోని నాగలింగేశ్వరస్వామి, బోడమల్లేశ్వరస్వామి దేవాల యాలను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నైనీశ్వరస్వామి , సింగనమలలోని గురు నాథేశ్వరస్వామి ఆలయం, కొండూరులోని కోటేశ్వరస్వామి, కట్టవారిపల్లెలోని కంబాలేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి భక్తిని చాటుకున్నారు.

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట సమీపంలోని మృకుండాశ్రమం భక్తులతో కిటకిటలాడింది. చెరువు కట్టపై, స్థానిక కోదండరామాలయంలో ఉన్న శివాలయాలు భక్తులతో నిండిపోయాయి.

ఓబులవారిపల్లె : బొమ్మవరం గ్రామంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర ఆలయంలో ఉమ్మలరాజు పిచ్చిరాజు, ఉమ్మలరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో పుష్పాలంకరణ, అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ పూజల్లో పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. . మధ్యాహ్నం సుమారు 2500 మందికి అన్నదానం చేశారు. శ్యామలాంబ అమ్మవారికి విశేష అలంకారం చేశారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సిద్దవటం : బాకరాపేట గ్రామంలోని భవానీశంకరాలయంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ ప్రజలు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. టక్కోలు గ్రామ శివాలయానికి వెళ్లే దారిలో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, సర్పంచ్ లక్ష్మీదేవి, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, నాయకులు చిన్నపరెడ్డి, టీడీపీ కార్యకర్తల సహకారంతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరు : భుజంగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయంలో శివ, పార్వతులకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఉంగరాల చిన్నా పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



రైల్వేకోడూరు: వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమర్‌నాథ్



కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు రామాశ్రీనివాస్

రైల్వేకోడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలం లో ఎక్కువగా పక్కాగృహాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, భూమి కొలతలకు సర్వేలు, పలు సరిఫికెట్లు, ఇంటి స్థలాలు తదితరాల కోసం వినతులు అందాయని తెలిపారు. గ్రామ పంచాయతీలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. దళిత, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజా సంఘాలు విన్నవించాయని తెలిపారు. ఆయా గ్రామాలను పరిశీలించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను ఆపండి

రాయచోటి కలెక్టరేట్: వీరబల్లిలోని సంఘం వాండ్లపల్లె, పెద్దివీడు, వీరబల్లి గ్రామాల నుంచి రాయచోటికి వెళ్లే రహదారిపై మాండవ్యనది వంతెన సమీపంలో పెద్దపల్లి(ఎలకచెట్లపల్లి) వద్ద నదిలోని ఇసుకను ప్రతిరోజు వందలాది వాహనాలతో సుదూర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారంటూ సోమవారం పీజీఆర్ఎస్ జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీంతో మాండవ్యనదిపై ఉన్న వంతెనకుముప్పు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పొత్తపి గ్రామ అభివృద్ధికి కృషి

● రాజంపేట అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి



సోమశిల వెనుకజలాలను పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్ రాజు

నందలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల ప్రాంతమైన పొత్తపి గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని రాజంపేట అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం పొత్తపి గ్రామానికి విచ్చేసిన చమర్తిని తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు మోదుగుల పెంచలయ్య, గ్రామస్థులు, స్వాగతం పలికి దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నిపాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్తీక సోమవారం సందర్భంగా శివాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సోమశిల బ్యాక్‌వాటర్‌ను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్, కోక్లస్టర్ సర్పంచ్ యానాది, టీడీపీ నాయకులు రమణయ్య, శివయ్య, దొరబాబు, భాస్కర్, ఎం.రమణయ్య, ఆర్‌కే చైతన్య, దాము, శ్రీనివాసులు, జి.సుధాకర్, ఎస్.మహేశ్వరి, జి.భాస్కర్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

దత్తతపై అవగాహన



గోడపత్రికలను విడుదల చేస్తున్న డీఆర్‌వో, అధికారులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు10(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తును నిర్మిద్దాం.. అడ్డంకులతో కాదు, పూర్తి సంరక్షణతో అనే నినాదంతో, ప్రతి బిడ్డ ముఖ్యం అనే ఉద్దేశ్యంతో దతత తీసుకోవడాన్ని ప్రోత్సహించడంతోపాటు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు కుటుంబ ఆధారిత సంరక్షణ అందించే విధంగా అవగాహన కల్పించడం లక్ష్యంగా దత్తత అవగాహన - 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. ఏపీ సర్వే అధికారి భరత్‌కుమార్, ఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, డ్వామా పీడీ వెంకటరత్నం, ఐసీడీఎస్ అధికారి హైమావతి తదితరులతో కలసి సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో గోడపత్రికలు విడు దల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్తతపై ప్రతి సంవత్సరం నవంబరులో జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని కాపాడండి



ఆందోళన చేస్తున్న గోపమాంబపురం గ్రామ ప్రజలు

రాజంపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించాలంటూ మండలంలోని శవనవారిపల్లె పంచాయతి గోపమాంబపురం గ్రామస్థులు సోమవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. శ్మశానం ఆక్రమణతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

అగ్నిమాపక శాఖ ఉద్యోగి నిజాయితీ



మహిళకు నగదు అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యం

రాజంపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అగ్నిమాపక కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం తన నిజాయితీని చాటుకున్నారు. ఈనెల 8వ తేదీ రాజంపేట ఏడీబీ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకునేందుకు హెడ్‌కానిస్టేబుల్ వెళ్లాడు. అయితే అప్పటికే ఏటీఎం మిషన్‌లో రూ.10,500 బయటకు వచ్చి ఉన్న విషయాన్ని గమ నించారు. ఏటీఎం బయట ఎవరూ లేకపోవడంతో ఆ నగదు తీసుకుని తన వద్ద ఉంచుకున్నాడు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో సోమ వారం బ్యాంకు మేనేజర్‌కు ఆ సొమ్మును అప్పగించారు. బ్యాంకు మేనేజర్ సీసీ ఫుటేజిని పరిశీలించి ఆ నగదు ఓ మహిళకు చెందినదిగా గుర్తించారు. ఆ మహిళను పిలిపించి హెడ్‌కానిస్టేబుల్ చేతుల మీదుగా ఆమెకు నగదు అందజేశారు.

'మా కాలనీకి తాగునీరు ఇవ్వండి'

ఒంటిమిట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాలనీకి తాగునీరు ఇవ్వండి అని ఆ కాలనికి చెందిన మహిళలు ఎంపీడీవో సుజాతమ్మకు వినతిపత్రం అంద జేశారు. సోమవారం మండలంలోని గంగపేరూరు జగనన్న కాలనీవాసులు సీపీఎం మండల కార్యదర్శి నరసయ్యతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీకి ఎన్నోసార్లు నీరు ఇస్తానని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. మా గ్రామానికి పక్కనే పెన్నానది నుంచి నీరు వచ్చే పైపులైను ఉన్నదని, దానినుంచైనా తాగునీరు అందించాలన్నారు. నీటి సౌక ర్యం లేకపోవడంతో కాలనిలో నివాసం కూడా ఉండలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనివాసులు మరియమ్మ, జయమ్మ, ఆదిలక్షుమ్మ, వెంకటనరసయ్య నాగరాజు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇస్తారా.. భూములు వాపసు చేస్తారా?

● కలెక్టరేట్ వద్ద ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నష్టపరిహారం ఇస్తారా లేక భూములు వాపసు చేస్తారా ..? అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పీ. శ్రీనివాసులు ప్రశ్నించారు. సోమవారం ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం సేకరించిన భూము లకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా రిజర్వాయర్ నిర్మించారన్నారు. రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు ప్రకటనలు చేశారని, అధికారంలోకి వచ్చి దాదాపుగా 20 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కారణంగా ముంపునకు గురవుతున్న గ్రామాల అభివృద్ధి గురించి గానీ, రైతులకు నష్టం పరిహారం గురించి గానీ ఒక ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. విజయవాడలో ఆర్ అండ్ ఆర్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం, సెక్రటేరియట్‌లో అధికారులను, జిల్లా అధికారులను కలిసి విన్నవించిన ఫలితంగా 27 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించారు తప్ప మిగిలిన వారి గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లెలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్న సభను విజయవంతం చేయాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పేరంపల్లి పంచాయతీలో తాతిరెడ్డి వినీతరెడ్డి, వెంకట్రా మిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంజనేయ, వినాయక స్వాముల బ్రహ్మోత్స వాల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన దేవగుడిపల్లెకు సమీపం లోని టిడ్కో ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలోనూ, బహిరంగ సభలోను పాల్గొనున్నారని తెలిపారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, శ్రీనివాస రాజు, టీడీపీ నాయకులు గీధర ధర్మారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, వీరరాఘవులు, లోకేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, చిట్టిబాషా, మిట్టేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ మోడల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం చౌటపల్లెలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి చెత్తాచెదారం, ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పచ్ఛదనం, పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి వాకిట్లో దుస్తులు ఉతికిన నీళ్లు పోయరాదని, పశువులను రోడ్ల మీద కట్టేయరాదని, ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు వాడకూదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి చంద్రబాబునాయుడు



ఉలవలు పంపిణీ చేస్తున్న షఫీనాయక్, మదన్‌మోహన్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఇబ్బందులు పడకుండా రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిచాడని మార్కెట్‌యార్డు చైర్మన్ షఫీనాయక్, మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. సోమవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 300 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని, ప్రతి రైతు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు వెంకట్రామరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకారపు జయరాం, మండల టీడీపీ యువనాయకుడు పక్కీరయ్య, పావని, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి - నేతాజీ సర్కిల్ : ప్రత్యామ్నాయ పంట సాగుకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. రాయచోటి మండలానికి 200 క్వింటాళ్ల ఉలవలు మంజూరైనట్లు తెలియజేశారు. 10 కేజీల ఉలవలు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై రూ.112తో పొందవచ్చునని తెలియజేశారు. రైతులు ఆధార్‌కార్డు , పట్టాదారు పాసుపుస్తకం ఫొటోస్టాట్ కాపీలు, సెల్‌ఫోన్ తీసుకొని రైతు భరోసా కేంద్రానికి వెళ్లాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమెంటు బల్లల ఏర్పాటు



శెట్టిగుంటలో ఏర్పాటు చేసిన బల్లలు

రైల్వేకోడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామంలో పలు చోట్ల సోమవారం శెట్టి గుంట సేవాసమితి కువైత్ ఆధ్వర్యంలో సిమెంట్‌తో త యారు చేసిన బల్లలు ఏర్పాటు చేసిన ట్లు సేవా సమితి అధ్యక్షుడు కే. మురళీకృష్ణ, కార్యదర్శి జే. నా గేంద్ర, కోశాధికారి కే. లోకేశ్వర్, అధికార ప్రతినిధి ఎన్. భరత్‌కుమార్, గౌర వ సలహాదారు కే. రఘు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు తదితరులు సేద దీరేందుకు వీలు గా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తామని వివరించారు.

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి హేయమైన చర్య

సుండుపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సీజే గవాయిపై దాడి హేయమైన చర్య అని ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు వీరనాగయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 17న ఢిల్లీలో జరిగే దళిత ఆత్మగౌరవ ప్రదర్శనను జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ దేశానికి రాష్ట్రపతి అయినా దళితులపై కుల వివక్ష వీడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు నాగేశ్వర, ఎంఎస్పీ మండల నాయకులు నాగరాజా, గడ్డం నాగలేసు, వెంకటేశ్, రమేశ్, పెద్దలు పాల్గొన్నారు.

దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆనంద్‌కుమార్



గాలివీడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దాసరి కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా తనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మారువేణి ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 10 కార్పొరేషన బోర్డు డైరెక్టర్ల జాబితాను ప్రకటించారు. అందులో గాలివీడు మండలం రాయచోటి నియోజకవర్గానికి చెందిన మారువేణి ఆనంద్‌కుమార్‌ను బోర్డు డైరెక్టర్‌గా నియ మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, నియోజకవర్గ టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. దాసరి సామాజికవర్గ సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

'క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది'

వీరబల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్డీకేఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్డీకేఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో మై భారత్, వీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మై భారత్ చేస్తున్న కృషి వెలకటలేనిదన్నారు. ఈ పోటీల్లో ఆరు టీంలు పాల్గొనగా విన్నర్స్‌గా సాయిటీమ్, రన్నర్స్‌గా ఎస్డీకేఆర్ టీం నిలిచాయి. గెలుపొందిన క్రీడాకారులకు వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి ప్రశంసాపత్రం, మెమెంటో, బహుమతులు అందజేశారు. అంపైర్లు రుక్సర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12నరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటలో భాగంగా చిన్నమండెం మండలానికి విచ్చేస్తున్న సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని రాష్ట్ర పాల ఏకరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ నాగేశ్వర్‌నాయుడు పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలియజేశారు.

క్షత్రియులకు దానగుణం.. దయాగుణం

● రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు



మాట్లాడుతున్న క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు

రైల్వేకోడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దానగుణం, దయాగుణం కల్గిన వారు క్షత్రియులని, అందరూ ఐక్యంగా ఉండి పేదల తరఫున పోరాడాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు అలియాస్ సూరి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన క్షత్రియ గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షత్రియులు కలిసికట్టుగా ఉండి సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. క్షత్రియులు దళిత, గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటాలు చేయాలన్నారు. క్షత్రియ పేద విద్యార్థుల చదువులు, ఉద్యోగాలకు ప్రయత్నించాలన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల్లో ఉన్న క్షత్రియులు అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, ప్యాక్టరీ రాజకీయాలకు దూరంగా ఉండి హక్కులను సాధించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. క్షత్రియులు ఏ పార్టీలో ఉన్నా క్షత్రియ సేవ ఆపేకూడదన్నారు. ప్రస్తుతం అన్ని కులాల వారు తమ ఉనికిని కాపాడుకునేందుకు హక్కుల కావాలని పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలసి క్షత్రియుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అడవిపల్లి ప్రతాప్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న క్షత్రియులు అందరూ పోరాట పటిమ కల్గిన వారే అని తెలిపారు. గ్రామాల్లో అన్ని కులాలను కలుపుకునిపోవాలన్నారు. కార్యక్రమంలో క్షత్రియ నాయకులు ముద్దలూరు చంద్రరాజు, ప్రముఖ లాయర్ అడైపల్లె వెంకట్రామరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్ రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

రాజంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్తవరం వెల్లోపల్లె ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బయ్య, పీడీఎం ఈశ్వర్‌నాయక్ తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఈ నెల 8న కడప మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో హస్తవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 ఖోఖో బాలికల క్రీడా విభాగంలో వి.దీక్షిత, వి.మానస, వి.మధుప్రియ, బాలుర విభాగంలో ఎ.హర్షవర్ధన్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు అనకాపల్లి జిల్లాలో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. హస్తవరం, వెల్లోపల్లె ఉన్నత పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌నాయక్ మూడు నెలల కిందటే నియమితులైనా తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

● రూ.40 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం

మదనపల్లె అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసి అతని నుంచి రూ.40లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ వి.మహమ్మద్ రఫీ తెలిపారు.



అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ

సోమవారం మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నందిగానిపల్లె గ్రామం కొక్కంటి క్రాస్‌కు చెందిన పసుపులేటి సూరిబాబు కుమారుడు పసుపులేటి సాయికుమార్(30) దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని, ఇందులో మదనపల్లె పట్టణంలో నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఔట్, తదితర చోట్ల దొంగతనాలు చేసి బంగారు నగలు అపహరించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట వద్ద ఆర్‌టీ బైపాస్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించండి

● జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సంక్లిష్టమైన అర్జీలను అలాగే పరిలిపెట్టకుండా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. గుర్రంకొండ మండలం రామిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగభూషణమ్మ తనకు ఆర్టీసీ బస్సు ప్రమాదం వలన కాలు విరిగిందని, చక్రాల కుర్చీకే పరిమితమయ్యానని తనకు వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరారు. సుండుపల్లెకు చెందిన బొమ్మిరెడ్డి భాగ్యమ్మ తన భర్త మరణించడని తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరింది. బి.కొత్తకోటకు చెందిన కె.చైత్ర తాను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తన కుమారుడు కె.సుచిత్ బి.కొత్తకోటలోని ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడని తల్లికి వందనం డబ్బులు ఇంతవరకు జమకాలేదని విచారణ జరిపి తల్లికి వందనం డబ్బులు ఇప్పించాలని కోరింది. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జేసీఎస్ బస్సు ఎస్.లక్ష్మీపతి, డ్వామా పీడీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నాడు ఘనం.. నేడు దయనీయం...

● ఐఏఎస్‌ల పాఠశాలకు ఆదరణ కరువు
● శతాబ్ది ఉత్సవాలకు దూరం
● షిఫ్ట్ పద్ధతిలో పాఠశాల, కళాశాల తరగతులు
● కూలేందుకు సిద్ధంగా భవనాలు



నందలూరులోని సరస్వతి నిలయం

నందలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాల నిర్మించి వంద సంవత్సరాలు పైబడింది. ఎంతోమందిని ఉన్నతస్థాయి కల్పించిన ఆ పాఠశాల నేడు దయనీయ స్థితిలో ఉంది. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలువురు విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేసింది. ఈ పాఠశాలలో చదివిన ప్రతిభకులు ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొందరు ఐఏఎస్‌లుగా ఇంకొందరు ఐపీఎస్‌లుగా మరి కొందరు వివిధ రకాల ఉన్నతాధికారులుగా, రాజకీయ నాయకులుగా, ఎమ్మెల్యేలుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అలాంటి పాఠశాల నేడు అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి దూరమైంది. రాజంపేట నియోజకవర్గాన్ని నాటి నుంచి నేటి వరకు పాలించిన ఒకరిద్దరు శాసనసభ్యుల మినహాయించి మిగతా వారందరూ మండలవాసులు కావడం గమనార్హం. దీంతో పాటు పాఠశాల ఇప్పటికే నూతన సొబగులతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అభివృద్ధిలో అడుగు వేయాల్సి ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదు కానీ ప్రస్తుతం ఈ పాఠశాల లోపలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. కాలం చెల్లిన భవనాల మధ్య బిక్కు, బిక్కుమంటూ చదువు నెట్టుకొస్తున్నారు. 1908లో ఏర్పాటు చేసిన ఈ జిల్లా పరిషత్ పాఠశాల నేడు దయనీయ స్థితికి చేరుతోంది. 1968 ఏ 3వ తేదీ అప్పటి ఎమ్మెల్యే బండారు రత్నసభాపతి, అప్పటి కడప జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డి సమయంలో నిర్మించిన సైన్సు బ్లాక్ భవనాలు ఏ సమయంలో కూలుతాయోనని అటు విద్యార్థులతో పాటు ఇటు గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. పరిపాలనా భవనం కూడా కాలం చెల్లింది. ఇప్పటికే స్లాబు పెచ్చులూడి పడుతుండడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం నెట్టుకొస్తున్నారు. పాఠశాల దుస్థితిని గమనించిన పలువురు మండల నేతలు కాలం చెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించాలని పలుమార్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు విన్నవించినా ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడం బాధాకరం. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కాలం చెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు. కొంతమంది పూర్వపు విద్యార్థులు పాఠశాలలో స్టేజ్ నిర్మాణాన్ని చేపట్టారు. మరికొందరు విద్యార్థుల అవసర కలయికలో డెస్కులు, ఇతర సామగ్రిని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు ఉన్న ఆసక్తి సైతం అధికారులకు లేకపోవడం ఏమిటని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎప్పుడు కూలుతుందో తెలియని రెండో అంతస్తు భవనం

పాఠశాలలోనే కళాశాల తరగతులు

ఉన్న భవనాలు అంతంత మాత్రమే. మరి ఇలాంటి తరుణంలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గతంలో పాఠశాల తరగతులు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాఠశాలలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠశాల విద్యార్థులకు, మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు పూర్తి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల నూతన భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ అది మరుగునపడిపోయింది. ఏది ఏమైనా టీడీపీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు నందలూరు పాఠశాల, కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల వాసులు, విద్యార్థులు కోరుతున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం



ఉమ్మడి కడప జిల్లాలో ఐఏఎస్‌ల పాఠశాలగా ఖ్యాతి గడించిన నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రారంభించి 115 ఏళ్లు పూర్తయినా నేటికి శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం. ఐదుగురు ఐఏఎస్‌లు, రిజర్వు బ్యాంకు గవర్నర్, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పూర్వ విద్యార్థులు ఎందరో. ఇంతటి ఘనకీర్తి గల పాఠశాలలో వసతులు లేమి పీడిస్తోంది. దీనిపై చొరవ చూపి పాఠశాల ఉత్సవాలు నిర్వహించాలి.

- డాక్టర్ రాజప్రసాద్, రాజంపేట బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్, నందలూరు

క్రీడామైదానం కేటాయించాలి



పాఠశాలకు కేటాయించిన క్రీడా మైదానం 2 కి.మీ. దూరంలో ఉండడం వల్ల విద్యార్థులకు నిరుపయోగంగా మారింది. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు కొరవడుతున్నాయి. తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, విద్యార్థుల కోరిక మేరకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

- సమ్మెట శివప్రసాద్, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

కన్నతల్లే హంతకురాలు

● బిడ్డను చంపించి.. అంత్యక్రియలకు హాజరు
● ఎంబీఏ విద్యార్థి జయప్రకాష్‌రెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులు
● తల్లితో పాటు ఏడుగురు అరెస్టు





నిందితులను చూపుతున్న సీఐ గోపాల్‌రెడ్డి, (ఇన్‌సెట్లో) హత్యకు గురైన జయప్రకాష్‌రెడ్డి


బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కన్నతల్లే కాలాంతకురాలైంది.. స్వార్థం ముందు పేగుబంధం చిన్నబోయింది.. బిడ్డలే ఆస్తి, బిడ్డల సుఖం, బిడ్డలే సర్వస్వం అనే మాటలను పక్కనబెట్టి ఆస్తి ముఖ్యం.. సుఖమే ప్రధానం అన్నట్టు మాతృత్వానికే మచ్చ తెచ్చింది ఈ మహాతల్లి. కని, పెంచిన కొడుకు పాలిట కసాయిగా మారింది. పెళ్లికొచ్చిన కొడుకును పథకం ప్రకారం కడతేర్చి ఏమీ తెలియనట్టు అంత్యక్రియలకూ హాజరైంది. అందరూ అనుమానించినట్టే ముద్దాయిగా నిలిచింది.

బి.కొత్తకోట మండలం గొల్లపల్లి పంచాయతీ పరిధిలోని గుడిసివారిపల్లెలో ఈ నెల 7న జరిగిన బీటెక్ విద్యార్థి తిరుమలయ్యగారి జయప్రకాష్‌రెడ్డి హత్య కేసులో కన్నతల్లి శ్యామలమ్మ ప్రధాన నిందితురాలని, సుపారీ ఇచ్చి తన పెద్ద కొడుకును కడతేర్చినట్టు పోలీసులు బయటపెట్టారు.

మాతృత్వం మంటకలిసిన ఈ ఉదంతం గురించి సోమవారం సీఐ గోపాల్‌రెడ్డి వివరాల మేరకు.. గుడిసివారిపల్లెకి చెందిన లేట్ తిరుమలయ్యగారి వెంకటసివారెడ్డికి భార్య శ్యామలమ్మ(41), కుమారులు జయప్రకాష్‌రెడ్డి(24), గిరివర్ధన్ రెడ్డి(21) ఉన్నారు. వారిలో జయప్రకాష్‌రెడ్డి అంగళ్లు వద్దనున్న మిట్స్ కాలేజీలో ఎంబీఏ సెకండ్ ఇయర్ చదువుతుండగా, గిరివర్ధన్‌రెడ్డి గుంటూరులో సీఏ కోచింగ్‌లో ఉన్నాడు. తండ్రి నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. అయితే నాలుగు నెలలుగా తల్లి శ్యామలమ్మకు, పెద్దకొడుకు జయప్రకాష్‌రెడ్డికి విభేదాలు వచ్చాయి. తనకు ఆస్తి పంచాలని కొడుకు పట్టుబట్టడంతో వలుమార్లు గొడవపడ్డారు. తల్లి విషయంలో మనస్పర్థలు చెందిన జయప్రకాష్‌రెడ్డి తాగుడుకు అలవాటు పడి కళాశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే వుంటున్నాడు. బిడ్డకు ఆస్తి పంచడం ఇష్టం లేని తల్లి కొన్నిరోజులుగా తన పుట్టినిల్లు మదనపల్లి సమీపంలోని జిట్టుపల్లిలో వుంటోంది. గొడవను సహించలేని శ్యామలమ్మ చడానికి ఆస్తి పంచడానికి బదులు కన్నకొడుకునే చంపించాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం తనకు బాగా పరిచయం ఉన్న పీటీఎం మండలం నాగన్నకోటకు చెందిన ఆవులకుంట మహేశ్(32)ను పురమాయించింది. తన పెద్దకొడుకును చంపాలని ఎంత ఖర్చు అయినా ఇస్తానని చెప్పింది. రూ.10 లక్షలు ఇవ్వాలని మహేశ్ కోరగా రూ.6లక్షలకు డీల్ కుదుర్చుకుంది. తనకు తెలిసిన 6మంది యువకుల సాయంతో మహేశ్ పథకాన్ని అమలు చేశాడు. ఈ నెల 6న రాత్రి గుడిసివారిపల్లెకి వెళ్లి జయప్రకాష్‌రెడ్డిని తన బొలెరోలో ఎక్కించుకొని గొల్లపల్లి వద్దనున్న వైన్‌షాపులో మద్యం తీసుకొని తుమ్మలగుట్ట పైవద్ద తీసుకెళ్లి బాగా తాగించారు. మళ్లీ అదే వాహనంలో ఎక్కించుకొని బయలుదేరగా ముందస్తు ప్లాన్ ప్రకారం రామానాయునికోటకు చెందిన జి.బానుప్రకాశ్(23), ములకలచెరువుకు చెందిన సాయిగణేశ్(22), ని.ఆకాశ్(22) ఒక ద్విచక్రవాహనంలో, సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మార్పూరివారిపల్లికి చెందిన పి.కిరణ్(23), సిరాజుల్ ప్రమోద్(20), చెంద్రాయునిపల్లికి చెందిన హరిప్రసాద్(19) మరో బండిలో అక్కడికి చేరుకొని బొలెరోను అనుసరించారు. మహేశ్ ఆ వాహనాన్ని గుంతావారిపల్లి వైపు మళ్లించగా కొద్ది దూరం వెళ్లాక, జయప్రకాష్‌రెడ్డిని కిందకు దింపి వెంట తెచ్చుకున్న బేస్‌బాల్ బ్యాట్‌తో విచక్షణారహితంగా దాడిచేశారు. తీవ్రంగా గాయపడిని అదే బొలెరోలో వడేశారు. అనంతరం జాతీయరహదారి గుండా వెళ్లి ఎస్‌ఆర్ ఓటేల పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని చూశారు. వీలు పడకపోవడంతో తిరిగి గుడిసివారిపల్లె వద్దకు తీసుకొచ్చి వాహనంలోంచి కిందకు లాగి కొన ఊపిరితో ఉన్న జయప్రకాష్‌రెడ్డి తలపై పెద్ద బండరాయితో మోది చంపేశారు. ఈ విషయాన్ని తల్లి శ్యామలమ్మకు తెలిపారు. దీంతో చిన్నకొడుకుతో పాటు అంత్యక్రియలకూ హాజరైంది. రంగంలోకి దిగిన పోలీసులు క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టారు. తల్లి శామలమ్మపైనే అనుమానాలు రావడంతో సాంకేతిక సాయంతో హత్యకేసును చేధించారు. సూత్రధారి అయిన కన్నతల్లి శ్యామలమ్మతో పాటు మరో ఆరుగురిని ఇతర చోట్ల అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు



నిందితులను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు హత్యకు వాడిన కారును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం స్థానిక మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆగస్టు 15న మదనపల్లె మండలం సీటీఎం సమీపంలో బ్రిడ్జి వద్ద వ్యక్తి మృతిచెందిన విషయం అప్పట్లో కలకలం రేపింది. కదిరి రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా పోలీసుల విచారణలో ఇది హత్యగా గుర్తించి ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. బసినికొండకు చెందిన పఠాన్ ఆసీఫ్‌ఖాన్ (40), దేవళంవీధికి చెందిన షేక్ మౌలా (33), ఎగువకురవంకకు చెందిన సయ్యద్ సుల్తాన్(31), దేవళంవీధికి చెందిన టిప్ మహమ్మద్ రఫ్యానీ, అప్పారావుతోట, సైదాపేటకు చెందిన షేక్ సాదిక్ (22) అందరూ మంచి స్నేహితులని, అందరికి మద్యం, గంజాయి తాగడం అలవాటు ఉందని తెలిపారు. ఈ క్రమంలో వీరికి వెస్ట్‌బెంగాల్ నుంచి వచ్చి కురబలకోట మండలం అంగళ్లు వద్ద కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఎస్‌కే బిటో కబీర్ పరిచయం ఏర్పడిందని, ఇతను అప్పుడప్పుడూ ఊరి నుంచి వచ్చేటప్పుడు గంజాయి తెచ్చి వీరికి కేజీ రూ.24 వేలకు అమ్మేవాడన్నారు. ఈ విషయం తెలిసిన ఆసీఫ్‌ఖాన్ గంజాయి వారంలోపు తెచ్చి ఇవ్వాలని జిదీర్‌కు రూ.50వేలు ఇచ్చారు. అయితే నెల రోజులు గడుస్తున్నా తమకు గంజాయి ఇవ్వనందున ఆగస్టు 15న కారులో అంగళ్లు వద్ద జిదీర్‌ను కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు అడవిలోని నీలగిరి చెట్ల మధ్యకు తీసుకెళ్లి బాగా కొట్టారు. అనంతరం మదనపల్లెలోని ఆసీఫ్‌ఖాన్ ఇంట్లో ఉంచగా ఆదేరాత్రి జిదీర్ మృతి చెందాడని గమనించి సుల్తాన్ సూచనల మేరకు ఆసీఫ్‌ఖాన్, షేక్‌మౌలా ఆటోలో మృతదేహాన్ని సీటీఎం రైల్వే రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారు. అనంతరం కదిరి రైల్వే పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి మదనపల్లె వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు అన్సర్‌బాషా, శివకుమార్, టూటౌన్ ఎస్‌ఐ రహమతుల్లా నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా సయ్యద్ సుల్తాన్‌పై గతంలో విజయవాడ, పీలేరు, తిరుపతి, వాయల్పాడు, తదితర పోలీసుస్టేషన్‌లలో 18 కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కలికిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న ఒక తోటలో సోమవారం ఉదయం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో అతను ఇందిరమ్మ కాలనీకి చెందిన ముల్లంగి రమేశ్(55)గా గుర్తించారు. అయితే రమేశ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అనారోగ్యంతో మరణించాడా లేక పాత కక్షల వల్ల ఎవరైనా ఏమైనా చేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి...

చిన్నమండెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదివారం పండులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు విద్యుత్ కనెక్షన్ తొలగించే యత్నంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని చాకిబండలోని వండాడి కొండ సమీపంలో అడవి పందులను పట్టేందుకు ఆదివారం రాత్రి రాయచోటి మండలం మాదవరం గ్రామం కొండకిందపల్లెకు చెందిన పేయల కృష్ణమనాయుడు (47), పేయల మహేశ్‌నాయుడు, బాబు విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున విద్యుత్ లైన్ తప్పించేందుకు వెళ్లిన కృష్ణమనాయుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.



మృతి చెందిన కృష్ణమనాయుడు

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

రామసముద్రం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీసుస్టేషన్ పరిధిలోని సోమశేఖర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించకుండా పోయిన కేసు విచారణలో భాగంగా ఆ బాలికను నిందితుడు వివాహం పేరుతో ప్రలోభ పెట్టినట్టు విచారణలో వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం ?

బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు(64)పై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అతిగా మద్యం తాగిన ఆ యువకుడు వృద్ధురాలి ఇంటిలోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెపై దాడి చేసి అత్యాచారానికి ఒడిగట్టినట్టు సమాచారం. బాధితురాలిని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుని వెళుతున్న మహిళపై ఓ ఆకతాయి ద్విచక్రవాహనంలో వచ్చి వేధింపులకు గురిచేయటంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివాహిత తన పొలం వద్దకు నడిచి వెళ్తుండగా అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న షేక్ ఇమ్రాన్ వివాహితను చూసి అసభ్యకరంగా సైగలు చేస్తూ వేధింపులకు గురిచేశాడు. దీంతో ఆమె 112కు ఫిర్యాదు చేయగా షేక్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసుల తెలిపారు.

శివకేశవుల అలంకారంలో అఘోరలింగేశ్వరుడు

రాయచోటిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అఘోరలింగేశ్వరుడు శివకేశవుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వీర భద్రాలయానికి చేరుకొని శివలింగం, త్రిశూలం ఆకారంలో కార్తీక దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



వీరభద్రాలయంలో అఘోరలింగేశ్వరుడు

వర్షంతో పూల రైతు కుదేలు

- తోటల్లో నిలిచిన వర్షపు నీరు
- వ్యాపిస్తున్న తెగుళ్లు.. రైతుల బెంబేలు



మల్లెతోటలో జోరెత్తిన వర్షపునీరు

దువ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతోపాటు వీడకుండా పడిన వర్షాలతో పూలతోటల్లో నీళ్లు నిలబడి తెగుళ్ల సోకాయి. దీంతో పూల చెట్లు కొన్ని కుంచించుకుపోగా, మరికొన్ని కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని కానగూడూరు, క్రిష్ణంపల్లెతో పాటు ఐ.బోయనపల్లె, నారాయణపల్లె గ్రామాల్లో పూలతోటలు సాగుచేస్తారు. ఈ ప్రాంతాల్లో పూల సాగుతో కొందరు రైతులు, వాటి విక్రయాలతో మరికొందరు జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగు చేసిన మల్లె, సంపంగి, కాగడాలు, కనకాంబరాల తోటలు ఎడతెరిపి లేని వానలతో కుచించుకుపోయాయి. 35 శాతం దిగుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ సీజన్‌లో కానగూడూరులో ఉన్న పూలమార్కెట్ నిత్యం కళకళలాడేది. ప్రస్తుతం రైతులు పూలు తీసుకురాకపోవడంతో కళావిహీనంగా తయారైంది.

తోటలు దెబ్బతిన్నాయి



కౌలుకు పొలం తీసుకుని నాలుగున్నర ఎకరంలో మల్లె, జాజితోటలు సాగు చేశాను. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయాను. నెల రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షంతో పూల తోటలు దెబ్బతిన్నాయి. అరకొరగా దిగుబడి వచ్చినా కూలీల ఖర్చులు కూడా రావడం లేదు.

\- ఎన్.నరసింహులు, కానగూడూరు, పూల రైతు



వర్షంతో పూలతోటల్లో కింద వాడిన రెమ్మలు

కాలువపల్లెలో పేలిన గ్యాస్ సిలిండర్

- భారీగా ఎగిసి పడిన అగ్నికీలలు.. ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతి
- రూ.5లక్షలకు పైగా నష్టం



అగ్నికి ఆహుతవుతున్న ఇల్లు

ములకలచెరువు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాలువపల్లెలో ఓ ఇంట్లో సోమవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో అగ్నికీలలు భారీగా ఎగిసిపడ్డాయి. ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ.5లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. గ్రామస్థుల కథనం మేరకు... గ్రామ శివారులోని ఎస్సీ కాలనీలో ఉన్న పెద్ద రమణ ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన బయ టకు వచ్చేశారు. కొంత సేపటికి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలు, సామగ్రి కాలి బూడి దయ్యాయి. గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో గ్రామస్థులు ఉలిక్కి పడ్డారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలా నికి చేరుకుని మంటలు పక్కనున్న ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు.

టిడ్కో ఇళ్లకు దరఖాస్తుల ఆహ్వానం



కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇళ్లు కల్పించే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఏపీ టిడ్కో పరిధిలో కడప నగరం ఎన్టీఆర్ నగర్ ప్రాజెక్టు కింద నిర్మించిన జీ+3ప్లాట్లకు సంబంధించిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. 18ఏళ్లు పైబడిన వారు 15రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులు కడప నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సమర్పించాలన్నారు.

అందుబాటులో ఉన్న ఇళ్ల వివరాలు

జీఓఎంఎస్ నెంబర్ 39 ప్రకారం ఫేజ్-1 (శ్రీలక్ష్మీనగర్), ఫేజ్-2 (చలమారెడ్డిపల్లె) ప్రాంతాల్లోని ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 300 చ.అ. పూర్తి ఉచితమని తెలిపారు. 365 చ.అ. రూ.7.55 లక్షలు ఉంటుందని, కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.65 లక్షలు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. 430 చ.అ. రూ.8.55 లక్షలు ఉంటుందని.. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.90 లక్షల సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. 365 మరియు 430 చదరపు అడుగుల ఇళ్లకు బ్యాంకు రుణం తీసుకోకుండా స్వీయ చెల్లింపు చేసుకునే వెసులు బాటు కూడా ఉందన్నారు.

అర్హత ప్రమాణాలు

కడప నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారుల చిరునామా ఉండాలి. తప్పనిసరిగా మహిళ అయి ఉండాలి. కుటుంబానికి సొంతభూమి/ఇళ్లు ఉండకూడదు. వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించకూడదు. గతంలో కేంద్ర లేదా రాష్ట్ర హౌసింగ్ స్కీం లబ్ధి పొందకూడదు. సంవత్సరానికి సగటు విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు లోపుగా ఉండాలి. కుటుంబంలో నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి/పింఛన్‌దారుడు/ఔట్‌సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగి ఉండకూడదు.

దరఖాస్తుకు కావాల్సినపత్రాలు

లబ్ధిదారులు జీవిత భాగస్వామి/తండ్రి/తల్లి ఆధార్ కార్డులు, కుటుంబ రేషన్‌కార్డు, లబ్ధిదారు ఓటరుకార్డు.

ఫ్లాట్ కేటాయింపు విధానం

మొదట 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారుల వాటా చెల్లించిన వారికి ప్లాట్లు కేటాయిస్తారు. తదుపరి 300 చదరపు అడుగుల ఉచిత ఇళ్లకు కేటాయింపు జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు కడప నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు.

బ్రౌన్ జయంతి ఉత్సవంగా నిర్వహించడం హర్షణీయం

- వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్



ప్రసంగిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

కడప కల్చరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 227వ జయంతిని పురస్కరించుకుని బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో సోమవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపకులపతి తొలుత రాజీవ్‌మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశ మందిరంలో గల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుభాషా సాహిత్యానికి శాశ్వత వెలుగు నిచ్చిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. బ్రౌన్ నివశించిన బంగళా శిథిలాలను డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్థలదాత సంపత్‌కుమార్, జి.కృష్ణమూర్తి, జేసీ సుబ్బయ్య, ఎన్‌సీ రామసుబ్బారెడ్డి, కట్టా నరసింహులు లాంటి ప్రముఖులతో కలిసి బ్రౌన్‌స్మారక గ్రంథాలయమనే జ్ఞానసౌధాన్ని నిర్మించారన్నారు. వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి బ్రౌన్ అని కొనియాడారు. బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య రామనరసింహం మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ తెలుగుపై పట్టు సాధించి నిఘంటువుల నిర్మాణం చేస్తే తెలుగువారమైన మనం మాతృభాషను నిర క్ష్యం చేస్తూ ఆంగ్లంపై మక్కువ పెంచుకోవడం అవివేకమన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, తెలుగు శాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఎంఎం వినోదిని, పి.రమాదేవి, పుత్తా పుల్లారెడ్డి, పుత్తా బాలిరెడ్డి, విద్వాన్ గానుగపెంట హను మంతరావు, జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సరళ

చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని సచివాలయాల సిబ్బంది శిక్షణ ప్రత్యేకాధికారి, కాలహస్తి ఎంపీడీవో సరళ అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికాధికారి ఓబులమ్మ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర స్థాయి అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సరళ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుపీసీలను గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులుగా మార్చు కోవాలన్నారు. ప్రతి పంచాయతీలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని, తద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. ముఖ్యంగా ఎస్‌డబ్ల్యుపీసీలు కేవలం చెత్త సంపద కేంద్రాలుగా కాకుండా అందులో పలు రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకర వాతావ రణం నింపి ఆరోగ్య సంపద కేంద్రాలు తీర్చి దిద్దుకోవాల న్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయా లన్నారు. ఈ శిక్షణలో డివిజనల్‌స్థాయి అధికారులు వారి పరి ధిలో ఉన్న సచివాలయాల సిబ్బందికి శిక్షణ విషయాలు వివరించి గ్రామ పంచాయతీల అబివృద్ధికి చేయాలన్నారు.

కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎల్‌డీవో రామాంజనేయులు, జిల్లా సమన్వయ అధికారి రమణారెడ్డి, డీఎల్‌పీవోలు నూర్జహాన్, విజయభాస్కర్, ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు, డీపీఆర్‌సీ, ఆర్పీలు, ఎఫ్‌టీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలు వేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలు మీ కుంచెల నుంచి జాలువారాలని, సృజనాత్మక ఆలోచనలకు కలాఖండాలు రూపొంది ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులకు ఉద్బోధించారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళా విభాగంలో వారం రోజుల ఇంక్ ఏ పేరుతో ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో శ్రీచరణిని దేశమంతా ఎలా గుర్తుంచుకుందో అలా మీ రంగంలో మీరు తయారు కావాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయుక్తమయ్యే, సమాజాన్ని సంస్కరించే పెయింటింగ్స్ మీ నుంచి ఆశిస్తున్నామన్నారు. చిత్ర కళాకారులు అంతర్ముఖులుగా ఉంటారని ప్రస్తుత యుగంలో అలా ఉంటే రాణించలేమన్నారు. ప్రతి చిత్రకారుడు తన బ్రాండ్‌ను బిల్డ్ చేసుకున్నప్పుడే పెయింటర్‌గా ఆర్థిక వనరులతో పాటు ఖ్యాతిని ఆర్జించవచ్చన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కంకణాల గంగయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పలుసూచనలు తెలియజేశారు. అనంతరం వైస్ చాన్సలర్ బోర్డుపై పెయింటింగ్ వేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. తెలంగాణ, తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్ మేకింగ్ నిపుణులు చలపాక అప్పలాచారి విద్యార్థులకు శిక్షణ నైపుణ్యాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, బి.చిన్నరాయుడు, బి.ఈరప్ప, ఎం.వాసవి, ఎస్.చంటి, డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూతగాదా విషయమై ఇరువర్గాల ఘర్షణ

నిమ్మనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంపై జరిగిన ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. బండ్లపై పంచాయతీకి చెందిన మేకల లక్ష్మన్న, భార్య లక్ష్మమ్మ తమ పొలంలో పనుల చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వారి దాయాదులు మేకల రెడ్డెప్ప, భార్య వనజ సర్వే నెంబరు 424-2లో వున్న 1.74 ఎకరాల భూమిలో తమకు కూడా భాగం వుందని లక్ష్మన్న, లక్ష్మమ్మలను దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపరిచారు. వాస్తవంగా ఈ భూమి మొత్తం లక్షన్న తమ్ముడు నాగరాజ పేరున వన్‌బీ పట్టాదారు పాస్‌పుస్తకాలు వున్నట్లు బాధితులు తెలిపారు. దీంతో మేకల రెడ్డెప్ప, వనజలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సోలార్ కంపెనీలో కేబుల్‌వైరు చోరీ

కొండాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీలో కేబుల్‌వైరు చోరీకి గురయింది. కంపెనీలో ఆదివారం రాత్రి సుమారు 9000 మీటర్ల కేబుల్ వైరు చోరీకి గురయినట్లు కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేబుల్ విలువ సుమారు రూ.3,90,000 ఉంటుందని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

నమ్మి వచ్చిన ఆదివాసీలకు చిత్రహింసలు

- ఏజెన్సీ నుంచి 15 మందికి విముక్తి
- స్వస్థలాలకు పంపిన బీజేపీ నేతలు



గిరిజనులను రైలుకు పంపిస్తున్న బీజేపీ నాయకులు

కడప మారుతీనగర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఊరు కానీ ఊరులో చేపలు పట్టేందుకు నమ్మి వచ్చిన ఆదివాసీ గిరిజన తెగకు చెందిన 15 మందికి తిండి తిప్పలు పెట్టకుండా తీవ్ర హింసకు గురిచేస్తున్న ఓ ఏజెన్సీ బారి నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు శివానాయక్‌లు కాపాడి సురక్షితంగా వారి స్వస్థలానికి పంపించారు. సోమవారం కడప రైల్వేస్టేషన్‌లో వారు మాట్లాడుతూ ఓ ఏజెన్సీకి చెందిన కొందరు పెద్ద మనుషుల ముసుగులో ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్‌లో గల 15 మంది ఆదివాసీ గిరిజన తెగకు చెందిన వారిని రప్పించి ఒంటిమిట్ట మండలం కోడుమూరు సమీపంలో గల నది ఒడ్డున గల అటవీ ప్రాంతంలో వుంచి తినడానికి తిండి పెట్టకుండా ఇబ్బందులకు గురిచేశార న్నారు. ఈ విషయం గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు దృష్టికి తీసుకెళ్ళారన్నారు. ఆయన తమ దృష్టికి తీసుకురాగా ఒంటిమిట్ట సీఐ బాబుకు తెలిపామన్నారు. ఆయన తక్షణమే స్పందించి వారిని అటవీ ప్రాంతం నుంచి బయటకు రప్పించారన్నారు. వారికి అండగా నిలిచి భోజనం, మంచినీరు అందజేసి వారిని విశాఖపట్నం రైలుకు పంపించామని తెలిపారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు : సీఈవో



మురికి కాల్వను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

ముద్దనూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య లోపం కన్పించకూడదని జిల్లాపరిషత్ సీఈవో ఓబులమ్మ హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం సీఈవో పర్యటించారు. అందులో భాగంగా ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మురికినీటి కాల్వను పరిశీలించారు. కాల్వలో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. అలాగే ఇంటింటి చెత్తసేకరణపై క్లాప్ మిత్రల ద్వారా ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాల వద్ద మురికి నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాధాకృష్ణవేణికి ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, కార్యదర్శి సౌభాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపాలి

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన స్వామిత్వ సర్వేలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు తెలిపారు. సోమవారం బండ్లపై గ్రామ పంచాయతీలో స్వామిత్వ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠంలోని ఇళ్ల సర్వేను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇళ్ల యజమానులకు వారి స్థలాలపై అభ్యంతరాలు వుంటే తెలపాలని, వాటిని 21రోజులలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక గ్రామ పంచాయతీలో సోమవారం ఏవో మంజుల ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మంజుల మాట్లాడుతూ వేరుశనగ వేయని రైతులకు సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేస్తున్నామని, 10కేజీల బ్యాగు రూ.120 అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లప్ప, రాజన్న, లక్ష్మన్న, శ్రీపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న మదనపల్లెలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అల్టరిస్ట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, మేక్ మై ట్రిప్, స్విగ్గీ, డాక్టర్ రెడ్డీస్ గ్రో ఈవీ, హెటిరో ల్యాబ్స్, మీషో, ఎస్‌బీఐ కార్డ్స్, ఫోన్‌పే, సుగుణ ఫుడ్స్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని, ఆసక్తి గలవారు ఒరిజినల్ సర్టిఫికేట్లతో నేరుగా వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

తంబళ్లపల్లె అభివృద్ధి కూటమితోనే సాధ్యం

ములకలచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తంబళపల్లె అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న మదనపల్లె మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రులు నాదేండ్ల మనోహర్, రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్ హాజరవుతారని, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శంభో.. శివ శంభో..

- భక్తులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- మహాశివరాత్రిని తలపించిన మూడో కార్తీక సోమవారం



మల్లయ్య కొండపై భక్తుల సందోహం

తంబళ్లపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్య కొండ భక్తులతో కిటకిటలాడింది. మూడో కార్తీక సోమవారం పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తులతో మల్లయ్యకొండ నిండిపోయింది. ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే కొండపైన ఆలయానికి ఎగువన ఉన్న గౌరమ్మ అమ్మవారిని, కొండకు మార్గమధ్యలో ఉన్న ఏనుగుమల్లమ్మను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కొండపైన కళ్యాణ వేదిక వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రత నోములు నోచుకున్నారు.

ఘనంగా కేధారేశ్వరి గౌరీ వ్రతం

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో పలు ఆలయాల్లో సోమవారం కేధారేశ్వరీ గౌరీ నోముల వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో ఈవో రమణ, ప్రధాన అర్చకుడు విశేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో నోముల వ్రతం జరిపించారు. అలాగే సీటీఎంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో, దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో, సీటీఎం రోడ్డులోని మంజునాధస్వామి ఆలయంలో, నీరుగుట్టవారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు కార్తీకదీపాలను వెలగించారు.

శివ నామ స్మరణతో మార్మోగిన ఆలయం

కలకడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నది తీరన కొలువైన కామాక్షి సమేత సిద్దేశ్వర ఆలయానికి భక్తులు తరలివచ్చారు. మూడవ కార్తీక సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. ముందుగా స్వామి,అమ్మవార్లను రకరకాల పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే కేదారేశ్వర నోముల వత్రాన్ని ఆచరించారు.

కిటకిటలాడిన శివాలయాలు

వాల్మీకిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా కార్తీక మాసం మూడవ సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకాలు, హోమాది కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకాలంకరణలతో ముస్తాబైన గౌరీ కేదారేశ్వర దేవతామూర్తులకు విశేష భక్తజనం నడుమ గౌరీ వ్రత వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో మహాశివుడికి అభిషేకాలు, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల వద్ద తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం సందర్భంగా పీలేరులోని కాశీ విశ్వేశ్వర స్వామి, శివరామపురంలోని భ్రమరాంబికాదేవి మల్లికార్జున స్వామి, అడవిపల్లెలోని మద్దుండాల మల్లేశ్వర స్వామి, జంగంపల్లెలోని వీరభద్ర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ జరిపి అత్యంత శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా అర్బన్ సీఐ యుగంధర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ లోకేశ్ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



మదనపల్లె సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో..



కలకడలో నోముల వత్రం



పీలేరు శివాలయంలో కార్తీక దీపాల వెలుగు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కురబలకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కురబలకోట జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. ఈ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న కురబలకోటకు చెందిన కె.సన్నీ అండర్-14 విభాగంలో, అలాగే 9వ తరగతి చదువుతున్న జయనవ్యశ్రీ అండర్-17 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో ద్వారకనాథ్, హెచ్ఎం శ్రీదేవి, పీడీ మహేంద్ర నాయక్, జంగారెడ్డి, రఫీ, శివయ్య తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు...

గుర్రంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుర్రంకొండ జడ్పీ హైస్కూల్ తెలుగు విద్యార్థులు ఎంపికైనట్లు ఖేలో ఇండియా కోచ్ రవీంద్రనాథ్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ప్రసన్నకుమార్, హరినాథ్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 11న రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు.

మహాసభను విజయవంతం చేయాలి

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా జాయింట్ సెక్రటరీ వీరనాల మాణిక్యం తెలిపారు. సోమవారం రాచవేటివారిపల్లి పంచాయతీ గారబురుజులో రాష్ట్ర మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ ఆదివారం మదనపల్లి సీఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న మాల మహానాడు రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొని మాలలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రసంగిస్తారని తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నారాయణ, చంద్ర, రమణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

పద్య పోటీల్లో సత్తా చాటిన మురళీధర్‌రాజు

పీలేరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయులకు జరిగిన పద్య కవిత పఠన పోటీలలో పీలేరుకు చెందిన జలకనూరి మురళీధర్‌రాజు సత్తాచాటారు. ఆదివారం పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పద్య కవిత పఠన విభాగంలో పీలేరుకు చెందిన మురళీధర్‌రాజు తన ప్రతిభను చాటి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా మురళీధర్‌రాజును మదనపల్లె డీవైఈవో వై.లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈవో-2 పద్మావతి, పలువురు ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

సీపీఐ ఉద్యమానికి విరాళం

పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితికి ఆ పార్టీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ రూ.10 వేల విరాళం అందజేశారు. రాయచోటిలో సోమవారం జరిగిన సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆత్మీయ సమావేశంలో వెంకటేశ్ తన విరాళాన్ని అందజేశారు. అంతకుమునుపు ఉదయం ఆయన తిరుపతి నుంచి రాయచోటికి బయలుదేరిన గుజ్జుల ఈశ్వరయ్యకు పీలేరులో ఘన స్వాగతం పలికారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

మదనపల్లె/వాల్మీకిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టిప్పుసుల్తాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక బెంగళూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వీసీకే పార్టీ అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ టిప్పుసుల్తాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వాల్మీకిపురం జామియా మసీదు ప్రాంగణంలో టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా 52మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కర్ణాటక నేత రమేశ్, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల మోహన్, తెట్టు శ్రీనివాసులు, తలారి కృష్ణ, రెడ్డిప్రసాద్, క్రాంతి, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సింగిల్‌విండో డైరెక్టర్ చాను, సయ్యద్‌బాషా, జాఫర్, మెకానిక్ చాను, రియాజ్, సైదు, మున్వర్, తదితరులు పాల్గొన్నారు.

భూములు తీసుకుంటే ఎలా బతకాలి..?

- గుర్రంకొండ-రాయచోటి హైవేపై రైతుల ధర్నా



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

తంబళ్లపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటు పేరుతో జీవనాధారంగా ఉన్న తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే ఎలా బతకాలని పర్లగోర్లపల్లె రైతులు నిరసన తెలిపారు. తమ భూములను స్వాధీనం చేసుకుంటే ఆత్మహత్యలే శరణ్యమని బాధిత రైతులు గుర్రంకొండ-రాయచోటి హైవేపై సోమవారం బైఠాయించి ధర్నా చేశారు. మంగళవారం తంబళ్లపల్లె మండలంలోని రెడ్డికోట వద్ద ఏపీఐఐసీకి ప్రభుత్వం గుర్తించిన భూములలో పరిశ్రమల ఏర్పాటు పనులకు ఉన్నతాధికారులు భూమిపూజ చేయనున్నారు. దీంతో ఏర్పాట్ల పనుల పరిశీలన నిమిత్తం ఏపీఐఐసీ అధికారులతో కలసి తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం మధ్యాహ్నం వెళ్లారు. విషయం తెలుసుకున్న రైతులు గుర్రంకొండ-రాయచోటి ప్రధాన రహదారిపై అధికారులను అడ్డుకున్నారు. సుమారు 50 ఏళ్లకు పైగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వానికి అప్పగించబోమని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో తంబళ్లపల్లె మండలం రెడ్డికోట వద్ద గుర్రంకొండ-రాయచోటి హైవేపై ఉద్రిక్తత నెలకొంది. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములను స్వాధీనం చేసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని నిరసన తెలిపారు. రోడ్డుపై అడ్డంగా ద్విచక్రవాహనాలు ఉంచి రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. యువకులు పెట్రోలు ఒంటి మీద పోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా ప్రజలు అడ్డుకున్నారు. దీంతో హైవేపై కొంత సేపు వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. స్పందించిన తహసీల్దారు సమస్యను కలెక్టరు, సబ్ కలెక్టరు దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు. అనంతరం కుక్కరాజుపల్లె సచివాలయం వద్ద పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు.

కొత్త జిల్లాకు శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలి



సంఘీభావం తెలుపుతున్న బలిజ కులస్థులు

మదనపల్లె టౌన్/మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడనున్న మదనపల్లె జిల్లాకు శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలని రాయలయూత్ సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక రాయలయూత్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన బలిజకులస్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె ప్రాంతం చారిత్రాత్మకంగా విజయనగర సామ్రాజ్యంలో కలసి వుండేదని, ఈ నాలుగు నియోజకవర్గాల్లో బలిజ కులస్థుల సంఖ్యాబలం అగ్రస్థానంలో వుందని గుర్తుచేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి మదనపల్లె జిల్లాకు శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మునిరత్నం, మునిగోపాలకృష్ణ, జింకా చలపతి, ధనలక్ష్మి, జయరామ్, రాయల గణి, వరప్రసాద్, చంద్రశేఖర్, అర్జున, వినోద్, వేమన్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-2 పంచాయతీ కార్యదర్శి ఇంటిపన్నుల వసూళ్లలో అవినీతికి పాల్పడుతున్నారంటూ బీవైఎస్ నాయకులు సోమవారం సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. డీఏవో నిర్మలాదేవితో బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ కోళ్లబైలు-2 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.మంజుల ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రజల నుంచి ఇంటిపన్ను, కుళాయిపన్నులను సీఎంఎఫ్ఎస్ ఖాతాలో జమ చేయకుండా ప్రజల నుంచి నేరుగా నగదు రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా పెద్దమొత్తంలో పన్నుల రూపంలో వసూలు చేసిన నగదును తన సొంత ఖాతాకు జమ చేసుకుంటోందన్నారు. పంచాయతీ కార్మికుల వేతనాలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా పంచాయతీ కార్యదర్శే నేరుగా నగదు చెల్లింపులు చేస్తోందన్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉన్నతస్థాయిలో విచారణ చేస్తే అవినీతి బయటపడుతుందన్నారు. కాగా పంచాయతీ కార్యదర్శి ఎస్.మంజులపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు డిప్యూటీ ఎంపీడీవో భారతిని నియమించినట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. ప్రజల ఇంటి పన్నులు, కుళాయిపన్నులు ఇతర పన్నుల వివరాలను ఆయా ఇంటి యజమానికి నేరుగా వాట్సప్‌లో పంపుతున్నామని, అందులో వచ్చే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా స్వర్ణాంధ్ర యాప్ ద్వారా పన్నులు జమ చేయాలని ప్రజలకు సూచించారు.

'పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీకి లేదు'

- జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి



మాట్లాడుతున్న జనసేన కార్యదర్శి కలప రవి

పీలేరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి, పీలేరు ఏఎంసీ డైరెక్టర్ కలప రవి తెలిపారు. సోమవారం పీలేరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటనపై వైసీపీ నేతలు విమర్శించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఎర్రచందనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఉలిక్కిపడ్డ వైసీపీ నేతలు ఆందోళనతో ఏదేదో మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఎర్రచందనం స్మగ్లింగ్ ఎలా జరిగిందో, ఎవరి హస్తం ఉందో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిశోర్‌నాయుడు, పీలేరు మండల కార్యదర్శి రాజేశ్, యువత అధ్యక్షుడు చిరంజీవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

ములకలచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అకోలా జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ఆలస్యంగా నడిచింది. సాంకేతిక కారణాలతో రైలు నాలుగున్నర గంటలకుపైగా ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ రైలుకు ములకలచెరువులో స్టాపింగ్ లేదు. మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 8.09 గంటలకు వచ్చింది. అలాగే పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 8.43 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరుకోవాల్సిన రైలు ఉదయం 10.24 గంటలకు చేరింది. దీంతో ప్రయాణికులు రైలు కోసం రైల్వేస్టేషన్లలో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

వివాదాస్పదంగా ఇళ్ల స్థలాల కేటాయింపు

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో నివసిస్తున్న పేదలకు వివాదాస్పదంగా వున్న స్థలాల్లో ఇంటి పట్టాలు ఇచ్చారని పలువురు బాధితులు సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో నిర్మలాదేవి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బీకేపల్లెకు చెందిన బాలిరెడ్డికి సర్వేనెంబర్ 559/2లో 0.02 సెంట్ల స్థలానికి పట్టా ఇచ్చారు. కానీ ఆ స్థలం తమదంటూ కొంతమంది వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇదే బీకేపల్లెలో సర్వే నెంబర్ 548లో ఎం.సుప్రజకు రెవెన్యూ అధికారులు ఇంటి స్థలం పట్టా ఇవ్వగా, గుట్టగా వుండి ఎగుడు దిగుడు నివేశనకు అనువుగా లేదని చెప్పడంతో అధికారులు వేరే స్థలం చూపించారు. అక్కడ పునాదులు వేస్తుంటే ఆ స్థలం తమదంటూ కొందరు వచ్చి అభ్యంతరం తెలపుతున్నారని బాధితురాలు విన్నవించుకుంది. మదనపల్లె మండలం టీచర్స్‌కాలనీలో తమ ఇంట్లోకి పంచాయతీ మురుగునీటి కాలువను వదిలివేసారని, ఈ విషయం పలుమార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని బాధితురాలు స్వాతి ఫిర్యాదు చేశారు. 84 మంది పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు.

పీలేరులో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలి

పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పీలేరులో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయాలని దళిత బహుజన విద్యార్థి విభాగం(డీబీఎస్ఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ డిమాండు చేశారు. పీలేరులో సోమవారం ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన యువత క్రికెట్‌లో రాణిస్తున్నా సరైన సాంకేతిక శిక్షణ లేకపోవడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎదగలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అకాడమీ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తే పీలేరు నుంచి దేశం గర్వించదగ్గ క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. ఈ మేరకు ఆయన డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, తుమ్మల ధరణీకుమార్, గురునాథం, రామచంద్ర, వాసు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

పెద్దతిప్పసముద్రం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామ వీఆర్ఏ కదిరప్ప(55) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కదిరప్ప కొంత కాలంగా ఆనారోగ్యంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆదివారం స్వగ్రామమైన రంగసముద్రంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్ సోమవారం కదిరప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కదిరప్ప దహనసంస్కారాల ఖర్చులకు రూ.25వేలను రెవెన్యూ సిబ్బంది అందించారు. ఆయన వెంట స్థానిక వీఆర్‌వో రామకృష్ణ, అహ్మద్‌బాషాతో పాటు పలువురు వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

పీలేరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ప్రతి సమస్యను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇంటిపన్ను వసూళ్ల వేగం పెంచాలని, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, క్లోరినేషన్ విధిగా చేపట్టాలన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో-2 పద్మావతి, డిప్యూటీ ఎంపీడీవో యుగంధర్, ఈవో బ్రహ్మానందరెడ్డి, పీఆర్ ఏఈ రామక్రిష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక పంచాయతీ సరస్వతీనగర్‌లో రామ్మూర్తినాయక్‌పై హత్యాయత్నం చేసిన వారిని అరెస్టు చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య రాయలసీమ అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మూర్తినాయక్ తల్లి అక్కులమ్మపై బీజేపీ నాయకులు కోసూరి భవాని కొద్దిరోజులుగా కక్ష పెంచుకుని గొడవలు పడుతూ వుండేవారని, ఆదివారం ఒక మహిళ విషయమై కోసూరి భవాని తన అనుచరులతో కలసి రామ్మూర్తినాయక్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయమై బాధితుడు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, భవాని పోలీసుల అండతో బాధితులపైనే అక్రమ కేసులు బనాయించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ ఘటనపై డీఎస్పీ స్వయంగా విచారించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీఎస్ నాయకులు సురేంద్రనాయక్, నరసింహులునాయక్, మునస్వామి, మల్లేష్, రామ్మూర్తినాయక్ పాల్గొన్నారు.

16న మాల మహానాడు మహాసభ

- తుమ్మల ధరణీకుమార్

పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు రాష్ట్ర మహాసభను ఈనెల 16వ తేదీన మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీకుమార్ తెలిపారు. మహాసభ వాల్‌పోస్టర్లను సోమవారం పీలేరు దొడ్డిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లె ఎస్సీ కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలోని సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హాలులో జరిగే మహానాడుకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మాల మేధావులు, సామాజిక కార్యకర్తలు హాజరతారని తెలిపారు. మహానాడుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మాలలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, భాస్కర్, రాజు, హరికృష్ణ, ప్రసాద్, హేమంత్ కుమార్, మణి, శేఖర్, రెడ్డి, విజయ్, సోమక్క, చిట్టెమ్మ, ఎర్రమ్మ, భారతి, చిన్నక్క, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన, ఆర్థిక భద్రతే ప్రధాని మోదీ లక్ష్యం



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):పేదరిక నిర్మూలన, ఆర్థిక భద్రతే ప్రధాని మోదీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ రాయలసీమ కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కిరణ్ కుమార్ అన్నారు. స్వదేశీయ వస్తువులు కొని దేశ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌పై స్పందిస్తూ మొదట జీఎస్టీపై కొత్త సంస్కరణలు తీసుకువచ్చిన మోదీకి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం పన్నులో మార్పులు చేపట్టడం దేశాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రతి చిన్న వ్యాపారులకు మేలు జరిగేవిధంగా జీఎస్టీ ఆమోదం చేశారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.